కేసీఆర్‌ను కలిసిన సంగారెడ్డి బీఆర్ఎస్ శ్రేణులు

నవతెలంగాణ-సంగారెడ్డి



బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను సంగారెడ్డి బీఆర్ఎస్ నేతలు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ నేతృత్వంలో ఎర్రవెల్లి ఫాం హౌస్‌కు వారు తరలివెళ్లారు. కాగా రాను న్నది బీఆర్ ఎస్ ప్రభుత్వం అని.. పార్టీ కోసం అందరు కృషి చేయాలని మాజీ సీఎం కేసీఆర్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలు ప్రజలకు చేరవే యాలన్నారు. రాష్ట్రంలో ఒక్క పథకం కూడా సరిగా అమలు కావడం లేదన్నారు. కేసీఆర్ కలిసిన వారి లో ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, టీఎన్జీవోస్ మాజీ అధ్యక్షులు మామిళ్ళ రాజేందర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ లత విజేందర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు నక్క మంజులత నాగరాజ్ గౌడ్, రామప్ప, లావణ్య ప్రభూ గౌడ్, విష్ణువర్ధన్, పవన్, శ్రవంతి విఠల్, శ్రీకాంత్, లక్ష్మణ్, అశ్విన్, విఠల్, నాయకులు మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

క్షేత్ర స్థాయిలో శాస్త్రవేత్తలు, అధికారుల సందర్శన

నవతెలంగాణ-జగదేవపూర్



జగదేవపూర్ మండలంలోని ఇటిక్యాల, దౌలాపూర్, గొల్లపల్లి గ్రామాల్లో సాగు చేస్తున్న వివిధ పంటలను తోర్నాల డాట్ సెంటర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్, శాస్త్రవేత్తలు డా.విజయ్, డా.పల్లవి లు సందర్శించారు. మొదటగా ఇటిక్యాల గ్రామంలోని 6 ఎకరాల్లో వెదురు సాగు చేస్తున్న కిరణ్, సంతోష్‌రావుల పంటను వారు పరిశీలించి తగు సూచనలు చేశారు. అనంతరం దౌలాపూర్ గ్రామంలో రైతు సంజీవరెడ్డి ఆయిల్ పామ్ తోటలో అంతర పంటగా సాగు చేస్తున్న డబ్ల్యూఆర్‌జీ-255 రకం కంది పంటను వారు పరిశీలించారు. చివరిగా గొల్లపల్లి గ్రామంలో రైతు శ్రీనాథ్ సేంద్రియంగా సాగు చేస్తున్న కూరగాయలు, ఆకుకూరల పంటలను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వసంతరావు, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు సమత, ఖలీల్ రైతులు పాల్గొన్నారు.

తాను ఈఎస్ఐసీ డాక్టర్‌గా పనిచేయడం లేదు

ఈఎస్ఐసీ ఎం ప్యానల్‌లో తన పేరు ఎలా వస్తుందో తనకు తెలియదు

దుబ్బాక ప్రభుత్వాసుపత్రి వైద్యులు డాక్టర్ హేమరాజ్ సింగ్

నవతెలంగాణ-రామాయంపేట

ఈఎస్ఐసీ ఆన్ లైన్ డేటాబేస్‌లో తన పేరు ఎంప్యానెల్డ్ డాక్టర్‌గా కనిపిస్తుందని తన దృష్టికి వచ్చిందని, తాను ఈఎస్ఐసీ డాక్టర్‌గా పనిచేయడం లేదని దుబ్బాక ప్రభుత్వాసుపత్రి వైద్యులు డాక్టర్ హేమరాజ్ సింగ్ స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఈఎస్ఐసీలో విధులు నిర్వహించడానికి తాను ఎవరికి దరఖాస్తు చేసుకోలేదని, తనను ఎవరు సంప్రదించలేదని ఆయన అన్నారు. అలాంటిది తన పేరు ఈఎస్ఐసీ ఎం ప్యానల్‌లో ఎందుకు కనిపిస్తుందో తనకు తెలియదన్నారు. అందుకు ఎలాంటి బాధ్యత తాను వహించనని స్పష్టం చేశారు. దుబ్బాకలో గాని, మరెక్కడైనా ఈఎస్ఐసీ తరఫున వైద్యం కోసం తన వద్దకు ఎవరు రావద్దని ఆయన సూచించారు. ఈఎస్ఐసీ సంబంధిత అధికారులు ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకొని ఈఎస్ఐసి ఎం ప్యానల్ జాబితా నుంచి తన పేరు తొలగించడానికి తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

బొలెరో వాహనం ఢీకొని రైతు కూలీ మృతి

నవతెలంగాణ-కౌడిపల్లి



బొలెరో వాహనం ఢీకొని రైతు కూలి మృతి చెందిన సంఘటన మండల కేంద్రమైన కౌడిపల్లి బస్టాండ్ వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం చోటు చేసుకుంది. కుటుంబీకులు పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. కౌడిపల్లికి చెందిన మద్దెల రాములు (50) నాలుగు సంవత్సరాలుగా దామోదర్ రెడ్డికి చెందిన పొలం పనులు చేస్తున్నాడు. రోజు మాదిరిగానే శుక్రవారం తన ఎక్సెల్‌పై పనులకు వెళ్లి మధ్యాహ్నం ఇంటికి వచ్చి తిని తిరిగి ఎక్సెల్‌పై వెళుతున్న క్రమంలో బస్టాండ్ వద్ద నర్సాపూర్ నుంచి మెదక్ వైపు వెళ్తున్న బొలెరో వాహనం ఎక్సెల్‌ను ఢీకొట్టింది. అతివేగంగా ఢీకొనడంతో మద్దెల రాములు ఎక్సెల్‌తో పాటు రాములు గాలిలో ఎగిరి కొంత దూరాన పడి తీవ్ర గాయాల పాలయ్యాడు. 108లో మెదక్ ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్తు ప్రైవేటీకరణ ఆపాలి

ఎస్మా విరమించాలి : సీఐటీయూ డిమాండ్



నవతెలంగాణ-మెదక్

చండీగఢ్ విద్యుత్ ఉద్యోగులపై ఎస్మా నిర్బంధ చర్యలు మానుకోవాలని, ప్రైవేటీకరణ ఆపాలని టీజీ యుఈఈయూ (సీఐటీయూ) గౌరవ అధ్యక్షులు ఏ మహేందర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మెదక్ విద్యుత్ ఎస్.ఈ కార్యాలయం ముందు తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ (సీఐటీయూ)యూనియన్ ఆధ్వర్యంలో డిమాండ్ ప్లకార్డ్స్‌తో నిరసన తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) గౌరవ అధ్యక్షులు ఏ.మహేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చండీగఢ్ ప్రైవేటీకరణను తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు. ప్రవేటికరణకు వ్యతిరేకంగా గత 50 రోజులుగా విద్యుత్ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, వృద్ధులు, మహిళలు, పిల్లాపాపలనే తేడా లేకుండా సమ్మె చేస్తున్నారన్నారు. పలు గ్రామ కమిటీలు, సంక్షేమ సంఘాలు స్వతంత్ర మహిళా సంఘాలు, గురుద్వార్ కమిటీలు, రైతు, యువజన సంఘాల ప్రాతినిధ్యంతో ప్రైవేటీకరణ వ్యతిరేక వేదికను చండీగఢ్ ప్రజలు ఏర్పాటు చేశారన్నారు. అత్యధిక లాభాలను అర్జించే, సమర్థవంతమైన తక్కువ టారీఫ్‌లు గల ఈ విద్యుత్ సంస్థను ప్రైవేటీకరించడానికి ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తుందని విమర్శించారు. నిరసనలు చేస్తున్న ఉద్యోగుల డిమాండ్లు వినడానికి బదులుగా వారిపై ఏస్మాను ప్రభుత్వం ప్రయోగించిందన్నారు. పైగా యూనియన్ నేతలపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారని విమర్శించారు. ఇంకా చివరి ప్రయత్నంగా ఉద్యోగులు కూడా సమ్మె నోటీస్ ఇవ్వాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ఎస్మాను విరమించి, ఉద్యోగులపై చేపడుతున్న అణచివేత చర్యలను తక్షణమే ఉపసంహరించుకోవాలని తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) చండీగఢ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వెంటనే ఉద్యోగులు, వినియోగదారులతో చర్చలు జరపాలని కోరారు. కార్యక్రమంలో టీజీయూఈఈయూ (సిఐటీయూ) యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం నరసింహులు, గుడల రవీంద్ర ప్రసాద్. అడ్వైజర్ స్వామి, జీవన్, భానుప్రసాద్, సురేష్ కుమార్, శ్రీనులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన ఆర్డీవో రమాదేవి



నవతెలంగాణ-హవేలీఘనపూర్

రాష్ట్ర ప్రభుత్వం ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయడంతో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని మెదక్ ఆర్డీవో రమాదేవి పరిశీలించారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో పోలింగ్ కేంద్రం 428, 222 పోలింగ్ కేంద్రాలను కేంద్రంలోని వసతులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆమె వెంట తహసిల్దార్ సింధు రేణుక, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి అండగా ప్రభుత్వం

నవతెలంగాణ-న్యాల్‌కల్



పేదల ఆరోగ్యానికి కాంగ్రెస్ సర్కార్ అండగా నిలుస్తున్నదని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రేజింతల్ గ్రామానికి చెందిన ఈశ్వరప్పకు రూ.25000, సిద్ధన్నకు రూ.60,000 విలువగల చెక్కులను సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కవి ఎటీ వైస్ చైర్మెన్ తిరుపతి రెడ్డి, మాజీ ఎంపీటీసీ రేజింతల్ శ్రీనివాస్ రెడ్డి, సొసైటి డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, సిరాజుద్దీన్,రవీందర్ తదితరులున్నారు.

యాసంగి వరి నాట్లకు వలస కూలీలు



- తక్కువ ఖర్చుతో వరినాట్లు
- వలస కూలీలతో డబ్బు, సమయం ఆదా
- ఒక్క రోజులోనే నాట్లు పూర్తి చేస్తున్న కూలీలు





నవతెలంగాణ-వర్గల్

మండల వ్యాప్తంగా యాసంగి వరినాట్లు జోరుగా సాగుతున్నాయి. అన్ని గ్రామాల్లో వరినాట్లు చివరి దశలో ఉన్నాయి. వరినాట్లు జోరుగా ఉండడంతో కొన్ని గ్రామాల్లో కూలీలా కొరత ఏర్పడుతున్నది. కూలీలా కొరత ఏర్పడడంతో రైతులు ఇతర రాష్ట్రాలకు చెందిన వలస కూలీలను ఆశ్రయిస్తున్నారు. వలస కూలీలు ముఠాగా వచ్చి ఒకే రోజులోనే నాట్లు పనులు పూర్తిచేసి వెళుతున్నారు. పని వేగం పెరగడంతో డబ్బు సమయం ఆదా అవుతున్నదని రైతులు అంటున్నారు.

వర్గల్ గ్రామానికి చెందిన బడే మల్లేష్‌కి 2 ఎకరాల వరి పొలం ఉన్నది. వరి నాట్ల కోసం పొలం దమ్ముచేసి సిద్ధంగా ఉంచారు. వర్గల్ గ్రామంలో కొంతవరకు కూలీలా కొరత ఉండడంతో అతను వలస కూలీలను ఆశ్రయించారు. ఎకరం పొలానికి రూ.5వేలు చెల్లిస్తున్నట్లు రైతు మల్లేశం తెలిపారు. గ్రామంలో మహిళా కూలీలకు రూ.500 నుంచి రూ.600లు చెల్లిస్తున్న సమయానికి ఎవ్వరు రావడంలేదని అందుకే వలస కూలీలను ఆశ్రయిస్తున్నామని తెలిపారు.

వలస కూలీలతో నవతెలంగాణ..

వరి నాట్లు వేస్తున్న వలస కూలీలను నవతెలంగాణ పలకరించగా తాము కలకత్తా నగరం దగ్గర నుంచి వచ్చినట్లు తెలిపారు. వారు సుమారుగా 50 మంది వరకు వర్గల్ మండలవ్యాప్తంగా వివిధ గ్రామాల్లో పనులు చేస్తున్నారు. ప్రస్తుతం వారు 10 మంది కలిసి ఓ ముఠాగా ఏర్పడి వరి నాట్లు వేయటానికి వెళుతున్నారని నవతెలంగాణ విలేకరు తెలిపారు. వర్గల్ గ్రామానికి చెందిన ఓ గుత్తేదారుడు భూమి యజమాని ఎంత విస్తీర్ణంలో వరి నాట్లు వేయాలో ముందుగా తెలిసుకొని దానికి అనుగుణంగా కూలీలను పొలం వద్దకు పంపిస్తారు. యజమాని దగ్గర తీసుకున్న డబ్బులో తాను కొంత కమిషన్ తీసుకొని తమకు డబ్బులు చెల్లిస్తారు. 10 మంది ఉన్న ముఠా ఒక రోజుకు 3 ఎకరాల విస్తీర్ణం గల పొలంలో నాట్లు వేస్తారు. ఉదయం 5 గంటలకే పొలం వద్దకు వచ్చి పనులను ప్రారంభిస్తారు. ఎలాంటి ఆలస్యం చేయకుండా ఒకే రోజులో నాట్లు మొత్తం పూర్తిచేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. తక్కువ సమయంలో పనులు పూర్తి చేయడంతో రైతులు ఎక్కువగా వలస కూలీలకు మొగ్గు చెపుతున్నారు.



ఒక రోజులోనే నాటు పూర్తయింది



పొలం దమ్ము చేసి పెట్టగా మా గ్రామంలోని కూలీలు సమయానికి రాకపోవడంతో పనులు ఆలస్యమయ్యాయి. వలస కూలీలు రావడంతో ఉదయం నుండే నాటు పనులు ప్రారంభించారు. ఒకే రోజులో నాట్లు పూర్తయ్యాయి. ఎక్కువ మంది రావడంతో పని తొందరగా జరుగుతుంది, డబ్బు సమయం ఆదా అవుతుంది.

-బడే మల్లేష్ (రైతు వర్గల్)

పది మంది కలసి ముఠాగా పనిచేస్తున్నాం..



కలకత్తా దగ్గర నుంచి మేము 50 మంది వరకు వచ్చాము. పది మంది కలసి ఒక ముఠాగా ఏర్పడి వరి నాట్లు పనిని చేస్తున్నాము. ఉదయం నుంచి సాయంత్రం వరకు వరి నాట్లు వేసి పని పూర్తయ్యాకే వెళతాం. పది మంది కూలిలము కలసి ఒక రోజులు 3 ఎకరాల వరకు నాట్లు వేస్తున్నాం. ఎక్కడా వరి నాట్లు ఉన్నంతవరకు మాకు ఉపాధి దొరుకుతుంది.

-శంభు (వలస కూలి)

పనిచేస్తేనే పైసలు లేదంటే పస్తులే



వరి నాట్లు ఉన్నన్ని రోజులు ఇక్కడ పనిదొరుకుతుంది. ఇక్కడ పనులు పూర్తవగానే మళ్ళి మా సొంత ఊర్లకు వెళ్తాము. ఆర్థిక ఇబ్బందులు ఉండడంతోనే కుటుంబాన్ని విడచి ఇంత దూరం వచ్చి పనులు చేస్తున్నాం. పని చేస్తేనే పైసలు లేదంటే పస్తులు ఉండాల్సిందే.

-విష్ణు (వలస కూలి)

అంగన్వాడి కేంద్రంలోని పిల్లలను తమ సొంత పిల్లలుగా ఆదరించాలి

- గ్రామంలో పారిశుద్ధ్య పనుల పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



నవతెలంగాణ-హవేలీ ఘనపూర్

అంగన్వాడీ కేంద్రంలోని పిల్లలను తమ సొంత పిల్లలుగా ఆదరించాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా హవేలీ ఘనపూర్ మండలం బ్యాతోల్ గ్రామపంచాయతీలోని అంగన్వాడి కేంద్రం, ప్రాథమిక పాఠశాల గ్రామ పరిసరాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అంగన్వాడి కేంద్రాన్ని పరిశీలించి ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అంగన్వాడి కేంద్రాలు పనితీరు ఆదర్శమని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలు, గర్భిణీలు, బాలింతలు, ఆరోగ్యవంతమైన జీవన విధానాన్ని అలవాటు చేసుకునేలా చూడాలని అన్నారు. పిల్లలతో కలెక్టర్ కాసేపు ముచ్చటించి వారికి అందిస్తున్న పౌష్టికాహారం వివరాలను తెలుసుకొని, చిన్నపిల్లలకు కలెక్టర్ స్వయంగా భోజనం వడ్డించి పిల్లలతో కలిసి ఆహారాన్ని తీసుకున్నారు. అంగన్వాడీలోని పిల్లలతో కాసేపు సరదాగా గడిపారు. అంగన్వాడీ కేంద్రం ద్వారా వారికి నేర్పిస్తున్న విద్యాభోదనలు, రైమ్స్ కలెక్టర్ ఆలకించారు. ఈ సందర్భంగా పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించాలని కలెక్టర్ సూచించారు. ప్రాథమిక పాఠశాలను పరిశీలించిన కలెక్టర్ స్వయంగా పాఠాలు బోధించి విద్యార్థిని విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు పాఠశాల పరిసర ప్రాంతాలను కలియ తిరిగి డ్రింకింగ్ వాటర్, కిచెన్ షెడ్, ఇతర సౌకర్యాలను పరిశీలించి సమర్థ నిర్వహణకు తగు సూచనలు చేశారు. గ్రామంలో పారిశుద్ధ్య పనుల పరిశీలనలో, పారిశుద్ధ్య పనులకు సంబంధించిన సమస్యలను గుర్తించి, వాటికి పరిష్కారాలు సూచించడం జరుగుతుందన్నారు. కాలువల్లో ఎప్పటికప్పుడు చెత్తా చెదారం తొలగించాలి, తీసిన చెత్తను డంపింగ్ యార్డ్‌కు తరలించాలి, దోమల వ్యాప్తిని నివారించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన నివారణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



ముందస్తు అడ్మిషన్లు తీసుకుంటున్న విద్యాసంస్థలు

- గుర్తింపును రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్
- ముందస్తు అడ్మిషన్లు తీసుకుంటున్నా పట్టించుకోని డిఈఓ
- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అజయ్ కుమార్

నవతెలంగాణ-తూప్రాన్



మెదక్ జిల్లాలో ముందస్తు అడ్మిషన్లు తీసుకుంటున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ ఐ జిల్లా కార్యదర్శి అజయ్ కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత రెండు నెలల నుంచి పలు ప్రైవేట్ విద్యా సంస్థలు ముందస్తు అడ్మిషన్లు తీసుకుంటున్నా అధికారులు పట్టించు కోవడం లేదని ఆరోపించారు. జిల్లాలో ముందస్తుగా అడ్మిషన్లు తీసుకుంటున్న విద్యాసంస్థల గుర్తింపును వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లాలో ఉన్న పల్లవి స్కూల్, గీతా హై స్కూల్, రిషి మెమోరియల్ స్కూల్ ముందస్తు అడ్మిషన్లు తీసుకుంటున్నాయని ఆయన తెలిపారు. విద్యా సంవత్సరం పూర్తి కాకుండానే ముంద స్తుగా గత రెండు నెలలుగా అడ్మిషన్లు తీసుకుంటున్నారని, అలాంటి విద్యా సంస్థల గుర్తింపును రద్దు చేస్తూ తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. ఆ విద్యా సంస్థల లో అడ్మిషన్లను నిలిపివేయాలన్నారు. జిల్లాలో ముందస్తు అడ్మిషన్లు తీసుకుంటున్నా డీఈఓ రాధాకిషన్ ఎలాంటి చర్యలు తీసు కోవడం లేదన్నారు. అలాగే మండలా లలో ఉన్న ఎంఏ వోలు కూడా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. తక్షణమే ముందస్తు అడ్మిషన్లు తీసుకుంటున్న విద్యా సమస్యలపై చర్యలు తీసుకుంటూ, విద్యా సంస్థల గుర్తింపు రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అధికారుల వైఖరిని నిరసిస్తూ పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని అజయ్ కుమార్ హెచ్చరించారు.

అశోక్ కుమార్‌ను టీచర్ ఎమ్మెల్సీగా గెలిపించండి

నవతెలంగాణ-పటాన్‌చెరు



కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్, నిజాంబాద్ నియోజకవర్గ టీచర్ ఎమ్మెల్సీగా టీఎస్‌యూటీఎఫ్ బలపరిచిన ఉపాధ్యాయ ఉద్యమ నేత, టీపీటీఎఫ్ పూర్వ అధ్యక్షులు వై.అశోక్ కుమార్‌ని మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి టి. లక్ష్మారెడ్డి కోరారు. పటాన్‌చెరు పట్టణంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. గత 36 ఏండ్లుగా విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం పనిచేసిన నాయకుడు, గత పదేండ్లుగా ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం ఉమ్మడి ఉద్యమాల్లో క్రియాశీలక పాత్ర పోషించాడన్నారు. అలాంటి వ్యక్తిని కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలిపించి పెద్దల సభకు పంపిస్తే.. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి, పరిష్కారం కోసం ప్రయత్నించడానికి ఉపయోగపడతాడన్నారు. ప్రలోభాలకు లొంగకుండా అప్రజాస్వామిక విధానాలకి వ్యతిరేకంగా నిలబడి, ఉపాధ్యాయ గొంతుకగా ఉండి మన సమస్యలను వినిపించగలిగే పరిస్థితి ఉంటుందన్నారు. సంగారెడ్డి జిల్లాలోని ఉపాధ్యాయ మిత్రులందరు ఆలోచించి మొదటి ప్రాధాన్యత ఓటు ఇవ్వాల్సిందిగా కోరుతున్నామన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి వై. అశోక్ కుమార్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయ ఉద్యమంలో నిరంతరం ఉన్న నాయకుడిగా నేనున్నానని, ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు బాగా తెలిసిన వ్యక్తిగా ఉండి ఒక ఐక్య ఉద్యమంలో పాల్గొన్న నాయకుడిగా ఉన్నందున తనను బలపరచాలని కోరారు. అదేవిధంగా మిగతా అభ్యర్థుల నేపథ్యం కూడా పరిశీలించి ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ కోసం, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం పోరాటం చేస్తున్న ప్రధాన సంఘాలైన టీఎస్ యుటిఎఫ్ మరియు టీపీటీఎఫ్ ఉమ్మడి అభ్యర్థిగా ఎమ్మెల్సీగా అవకాశము ఇవ్వాలని ఉపాధ్యాయులందరినీ కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు కే అశోక్, ప్రధాన కార్యదర్శి బి.సాయిలు, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు కె.సోమశేఖర్, ప్రధాన కార్యదర్శి అనుముల రామచందర్, నాయకులు సంజీవయ్య, జనార్ధన్, రాములు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలందించడమే లక్ష్యం

- పటాన్‌చెరు ప్రాంతీయ ప్రావిడెంట్ ఫండ్ కమీషనర్-2 శ్రీదేవి
- చందాదారులకు పెన్షన్ చెల్లింపు ధృవపత్రాల అందజేత

నవతెలంగాణ-పటాన్‌చెరు



చందాదారులకు మెరుగైన సేవలందించడమే తమ లక్ష్యం అని ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్ఓ) పటాన్‌చెరు ప్రాంతీయ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్-2 శ్రీదేవి అన్నారు. ప్రయాస్ పథకం ద్వారా ఈనెలలో పదవి విరమణ చేసిన చందాదారులకు పెన్షన్ చెల్లింపు ఆర్డర్‌లను (పిపిఓలు) పంపిణీ చేసే కార్యక్రమాన్ని శుక్రవారం విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రయాస్ కార్యక్రమం తమ చందాదారులకు మెరుగైన సేవలందించాలనే తమ నిబద్ధతను నెరవేర్చడానికి ఒక ప్రయత్నమన్నారు. అర్హత కలిగిన ఈపీఎఫ్ఓ సభ్యులకు పదవీ విరమణ చేసిన నెలలోనే పెన్షన్ ప్రయో జనాలను మంజూరు చేసే ప్రక్రియను క్రమబద్ధీకరించడం, వేగవంతం చేయడం, పదవీ విరమణలోకి సాఫీగా మారేలా చేయడం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. జనవరి నెలలో పదవీ విరమణ పొందిన 42 మంది చందాదారులకు పీపీఓలను జారీచేసి, అందులో 25 మందికి కార్యాలయంలో అందజేశామన్నారు. తమ పదవీ విరమణ ప్రయోజనాలను పొందే ప్రక్రియను సులభతరం చేయడానికి, వేగవంతం చేయడానికి ఈపీఎఫ్ఓ చేసిన ప్రయత్నాలకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ పీఎఫ్ కమీషనర్ దిలీప్ మీనా, అకౌంట్స్ ఆఫీసర్ అబ్దుల్ అజీమ్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

40 ఏండ్ల నిరంతర సేవలకు ఘన సన్మానం



నవతెలంగాణ-పటాన్‌చెరు

పటాన్‌చెరు పట్టణానికి గత 40ఏండ్లుగా అంకితభావంతో సేవలు అందించిన ట్రాక్టర్ డ్రైవర్ సత్తయ్య, నీటి పారుదలశాఖలో అప్రతిమ సేవలు అందించిన రాములు వారి రిటైర్మెంట్ సందర్భంగా పటాన్‌చెరు మాజీ సర్పంచ్, ఎండిఆర్ ఫౌండేషన్ చైర్మన్ దేవేందర్ రాజు, పృథ్వీరాజ్‌లు శుక్రవారం ఘనంగా సన్మానించారు. పటాన్‌చెరు పట్టణానికి దేవేందర్ రాజు చివరి సర్పంచ్‌గా ఉన్న సమయంలో అంకితభావంతో పనిచేసి రిటైర్ అయిన సందర్భంగా ఎండీఆర్ ఫౌండేషన్ కార్యాలయంలో వారికి శాలువాతో సత్కారం చేసి, వారి సేవలను ప్రశంసించారు. ఈ సందర్భంగా వారు కుటుంబంతో ఆనందంగా, ఆరోగ్యంగా రిటైర్మెంట్ జీవితం గడపాలని ఆయన అభిలషించారు. పటాన్‌చెరు పటణాభివృద్ధిలో వారి సేవలు మరువలేనివిగా నిలిచాయని కొనియాడారు. వారి సేవలను గుర్తిస్తూ, సేవా ధృక్పథం కలిగిన ఉద్యోగులు ఎల్లప్పుడూ గుర్తించబడతారన్నారు. పదవీ విరమణ అనంతరం జీవితం ప్రశాంతంగా సాగాలని ఈ సందర్భంగా వారు అభిలాషించారు.

ఫ్లైఓవర్ బ్రిడ్జిపై కారు బోల్తా

దంపతులకు తీవ్ర గాయాలు

నవతెలంగాణ-చౌటకూర్



అతివేగంగా వెళ్తున్న ఓ కారు అదుపుతప్పి జాతీయ రహదారి ఫ్లైఓవర్ బ్రిడ్జీపై బోల్తాపడింది. ఈ ప్రమాదంలో కారులోని దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా నాందేడ్ అకోలా 161వ జాతీయ రహదారిపై శుక్రవారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణ ఖేడ్‌కు చెందిన గణేష్, నందన దంపతులు టీజీ08ఎఫ్2774 నెంబరు గల తమ కారులో నారాయణఖేడ్ నుంచి సంగారెడ్డి వైపు వెళ్తున్నారు. అయితే కారు అతివేగంగా ఉండడంతో చౌటకూర్ మండలం సరాఫ్‌పల్లి వద్ద జాతీయ ప్రధాన రహదారి ఫ్లైఓవర్ బ్రిడ్జిపై బోల్తా పడింది. దాంతో దంపతులకు తీవ్ర గాయాలు కాగా.. 1033 హైవే అంబులెన్స్ లో సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా స్థానికులు, హైవే సిబ్బంది కలిసి క్రేను సహాయంతో బోల్తా పడిన కారును రోడ్డు పక్కకు తరలించారు.

మెటల్‌కుంటలో రోడ్లపై మురుగు నీరు

దుర్గంధంతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు

నవతెలంగాణ-న్యాల్‌కల్



మండలంలోని మెటల్‌కుంట గ్రామపంచాయతీలో రోడ్లపైనే మురుగు నీరు పారుతున్నది. దాంతో ఆ మురుగు నుంచి వస్తున్న దర్గంధంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇండ్ల మధ్యనే మురుగు నీరు పారుతుండడంతో.. దోమలు, పందుల బెడద అధికమై అనారోగ్యం పాలవుతున్నామని స్థానికులు వాపోతున్నారు. పంచాయతీ పాలకవర్గం లేకపోవడం ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామపంచాయతీల అస్తవ్యస్తంగా మారాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇ ప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

పిడికిలెత్తి..



మండల పరిధిలోని ఓ రైతు పొలంలో పిడికిలి బిగించిన ఆకారంలో ఉన్న వంకాయ అందరినీ ఆకర్షిస్తున్నది. సమసమాజ స్థాపనకు ఉద్యమమే ఊపిరి అన్నట్టుగా.. అందుకు ప్రకృతి సహకరిస్తున్నట్టుగా ఈ చిత్రం కనిపిస్తోంది.

నవతెలంగాణ-కొండాపూర్

వివాహనిశ్చితార్థం వేడుకలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-కల్హేర్



మండలంలోని ఖానాపూర్(కె) గ్రామానికి చెందిన నార్ల రవీందర్ కుమార్తె వివాహనిశ్చితార్థం (ఎంగేజ్మెంట్) కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ వేడుకకు నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్‌రెడ్డి హాజరై నూతన వధూ వరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అదే గ్రామానికి చెందిన తాజా మాజీ ఎంపీటీసీ అంజయ్య సాగర్ మనవరాలు నూతన వస్త్రాలంకరణ కార్యక్రమానికి హాజరై చిన్నారిని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ మండల నాయకులు ఉప్పరి మోహన్ సాగర్, సాయిలు సాగర్ పవార్ సింగ్ అంజిగౌండ కమ్మరి సాయిలు హన్మంత్ రెడ్డి, కోటగిరి బాలయ్య, ప్రశాంత్ సాగర్ నడిల్ల రవీందర్, సంతోష్ కుమార్, రిటైర్డ్ రికార్డ్ అసిస్టెంట్ సాయిలు సాగర్, నాయకులు సంగయ్య, మోహన్, శ్రీనివాస్ సాగర్, తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీకగా పటాన్‌చెరు నియోజకవర్గం

నవతెలంగాణ-పటాన్‌చెరు



మినీ ఇండియాగా పేరొందిన పటాన్‌చెరు నియోజకవర్గం మత సామర స్యానికి ప్రతీకగా నిలుస్తోందని స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు పట్టణానికి చెందిన జీఎంఆర్ యువసేన నాయకుడు సోహెల్ బృందం ఆధ్వర్యంలో అజ్మీర్ దర్గా వెళ్తున్న సందర్భంగా ఎమ్మెల్యే ఆధ్వర్యంలో చదర్ కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం దర్గాకు చదర్‌ను సమర్పించారు. అల్లా ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, అఫ్జల్, పాండు, గూడెం విక్రం రెడ్డి, మాణిక్ రెడ్డి, మేరాజ్ ఖాన్, షకీల్, ఇమ్రాన్, మసూద్, సోహైల్, ఆదిల్, ఇర్ఫాన్, వసీం, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

నెలరోజులపాటు పోలీసు యాక్ట్ అమలు

నవతెలంగాణ-సంగారెడ్డి



జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని నెలరోజుల పాటు (ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 28 వరకు) జిల్లా వ్యాప్తంగా 30, 30(ఎ) పోలీసు యాక్ట్-1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ తెలిపారు. కాబట్టి పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేనిది సంగారెడ్డి జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్ లు, సభలు, సమావేశాలు నిర్వహించొద్దన్నారు. శాంతి భద్రతలకు భంగం కలిగే విధంగా, ప్రజా ధనానికి నష్టం కల్గించే, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేపట్టకూడదన్నారు. జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు ఇట్టి విషయంలో పోలీసు వారికి సహకరించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరిత్యా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.



ఉపాధి అవకాశాలను సృష్టించుకోవడం అభినందనీయం

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బొల్లారం మున్సిపాల్టీ పరిధిలోని బీసీ కాలనీకి చెందిన శ్రీనివాస్ చారి ఏర్పాటు చేసిన ఫుడ్ షాపును రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు వి.చంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకోవడం అభినందనీయమన్నారు. వ్యాపార సంస్థ వృద్ధిలోకి రావాలని ఆకాంక్షిస్తూ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాహకులు కౌన్సిలర్ చంద్రారెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గోపాలమ్మ, స్థానికులు అరుణ, నానీ, శ్రీను, బీరప్ప, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



కోహిర్‌లో ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-కోహిర్

హెచ్‌పీ పెట్రోల్ పంపు యాజమాన్యం, మెడికేర్ హాస్పిటల్ బృందం డాక్టర్ ఎంబీబీఎస్ సోయాబ్ ఆధ్వర్యంలో కోహిర్ మున్సిపాల్టీ కేంద్రంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. షుగర్, బీపీ లాంటి పరీక్షలు చేసి.. అవసరం ఉన్న వారికి మందులు, టీకాలు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మెడికేర్ హాస్పిటల్ బృందం ఎండి అబిదు, సోయల్, హామీదు, ప్రశాంతి, సంతోష్ కుమార్, హెచ్‌పీ పెట్రోల్‌పంప్ మేనేజర్ హింతాజ్ తదితరులు పాల్గొన్నారు.

15 గ్రామాలకు సీసీరోడ్లు మంజూరు

నవతెలంగాణ-న్యాల్‌కల్

మండలంలోని గుంజేటి, ఖలీల్‌పూర్, మిర్జాపూర్(బి), రాజోల, రుక్మాపూర్, రామ్ తీర్థం, అత్నూర్, చినిగేపల్లి, డప్పూర్, కాకి జన్వాడ, మరియంపూర్, ముంగి, న్యాల్‌కల్, రత్నాపూర్, తాటిపల్లి మొత్తంగా 15 గ్రామ పంచాయతీలకు సీసీరోడ్ల కోసం నిధులు మంజూరైనట్టు పంచాయతీరాజ్ డీఈ మల్లేశం తెలిపారు. ఈజీఎస్ నిధుల కింద ఈ సీసీరోడ్లు మంజూరయ్యాయన్నారు.



సేవోద్గాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగులు పంపిణీ

నవతెలంగాణ-మనూర్

మండలంలోని పులకుర్తి కెజిబి పాఠశాల విద్యార్థులకు సేవోద్గాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం బ్యాగులు పంపిణీ చేశారు. ఫౌండేషన్ సభ్యులు జయశ్రీ కీర్తి చేతుల మీదుగా వాటిని అందజేశారు. కాగా సేవోద్గాం సభ్యులకు పాఠశాల సిబ్బంది ధన్యవాదాలు తెలిపారు.



పాఠశాల, అంగన్వాడీల్లో ఎంపీడీఓ తనిఖీలు

నవతెలంగాణ-చౌటకూర్

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంపీడీవో రామలింగం శుక్రవారం సందర్శించారు. పాఠశాలలోని వివిధ క్లాస్ రూములను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు అర్థమౌతుందా అని అడిగి తెలుసుకున్నారు. అదేవి ధంగా పాఠశాలలో ఉపాధ్యాయులు అందుబాటులో ఉండి విద్యార్థులకు అర్థమయ్యే విధంగా చక్కటి విద్యను అందిం చాలన్నారు. ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులకు పరీక్షలు సమీపిస్తున్న సందర్భంగా స్పెషల్ తరగతులు నిర్వహించి ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలన్నారు. 100శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఆయనతోపాటు ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అదే విధంగా గ్రామంలోని అంగన్వాడి కేంద్రాలను తనిఖీ చేశారు. విద్యార్థులు ఎంతమంది వచ్చారో అటెండెన్స్ రోజువారీగా రిజిస్టర్‌లో ఎంట్రీ చేయాలని సిబ్బం దికి సూచించారు. చిన్నపిల్లలకు ఆట వస్తువులు చూపిస్తూ బోధన అందించాలని, వారికి సమయానికి అల్పాహారం అందించాలని టీచర్లకు తెలిపారు.

ప్రజల తిరుగుబాటు



- గ్రామ సభల్లో నిలదీతలు.. నిరసనలు
- అధికార పార్టీ వారికే ఇందిరమ్మ ఇండ్లా?
- లబ్ధిదారుల జాబితాలో తమ పేర్లు లేవంటూ ఆందోళన
- అధికారుల తీరుపై మండిపాటు



నవతెలంగాణ-ఝరాసంగం

ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం ఈ మధ్యన కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన గ్రామసభలు, వార్డు సభల్లో 5 రోజుల పాటు నిరసనలు, నిలదీతలు కొనసాగాయి. ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు, ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాలకు సంబంధించి గత నెల 24 వరకు గ్రామ సభలు నిర్వహించి లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేసి, గణతంత్ర దినోత్సవం రోజున సంబంధిత నాలుగు పథకాలను ప్రారంభించేందుకు ప్రభుత్వం నిర్ణయించి అమలుకు పూనుకుంది. అది కూడా పూర్తిస్థాయిలో అమలు జరగకపోవడంతో ప్రజలు అయోమయానికి గురయ్యారు. తాము అర్హులైనప్పటికీ లేనిపోని క్రైటీరియాలు పెట్టి రైతులకు రుణమాఫీకి దూరం చేసిన రేవంత్ ప్రభుత్వం ఈ నాలుగు పథకాలకు సంబంధించి కూడా నామమాత్రంగా కొంత మందికే ఇచ్చి ఎగనామం పెడుదామని చూస్తున్నదని ఆయా గ్రామాల ప్రజలు గ్రామ సభల్లో నిలదీశారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్ల పథకాలకు నిజమైన నిరు పేదలను గుర్తించకుండా కేవలం అధికార పార్టీ నేతలకు మాత్రమే పథకాలు వర్తిస్తాయా? అనే విమర్శలు గ్రామ సభ ల్లో విమర్శలు వెల్లు వెత్తాయి. ప్రజలు అనుకున్నట్టుగానే ప్ర భుత్వం మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి నాలుగు పథకాలను అమలుచేస్తున్నట్టుగాఅధికారులు మమ అనిపించారు.

రేషన్‌కార్డుల జాబితా నిరంతరంగ కొనసాగేనా?

వివిధ పథకాల లబ్ధిదారుల ఇంటింటి సర్వేలోనే కొత్త రేషన్ కార్డుల విషయంలో అర్హులై ఉండి దరఖాస్తు చేసుకుంటే తమ దరఖాస్తులు ఎటు పారే సారంటు ప్రజలు నిలదీశారు.దాంతో అప్రమత్తమైన ప్రభుత్వం గ్రామసభల్లో ఎలాంటి నిరసనలు, నిలదీతలు కాకుండా కొత్త రేషన్‌కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అంటూ చెప్పుకొచ్చారు. ప్రజాపాలన సమయంలో పడిగాపులు గాచి జిరాక్స్ కేంద్రాల చుట్టూ గంటల తరబడి క్యూలో నిల్చొని కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకుంటే ఇప్పుడు లేకపోవడం ఏంటని అధికారులను ప్రశ్నిస్తున్నారు. మళ్లీ గ్రామసభల పేరుతో దరఖాస్తులు చేసుకోవాలని అధికారులు చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రజలు విమర్శిస్తున్నారు.

ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే నిరంతర ప్రక్రియ..

ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే నిరంతర ప్రక్రియ అంటూ ప్రభుత్వం దాటవేస్తున్నదని ప్రచారం జరుగు తున్నది. ఇప్పటికే రుణమాఫీ విషయంలో ఏఈవో మొదలు కొని జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయంలో అర్హులైన ప్పటికీ రుణమాఫీకాని రైతుల దరఖాస్తులను స్వీకరించి ప్రభుత్వానికి అందజేసినప్పటికీ ఇప్పటి వరకు పట్టించుకో కుండా ఒక్క దరఖాస్తును కూడా పరిష్కరించని కాంగ్రెస్ ప్రభుత్వం..ఇప్పటికే వారు అనుకున్న లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేసి, గ్రామ సభల్లో దరఖాస్తులు తీసుకోవడం కేవలం ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతను తగ్గించేం దుకు మాత్రమేననే ప్రచారం ప్రజల్లో జోరందుకున్నది. కానీ అధికారులు మాత్రం అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలు అందించేందుకు కృషి చేస్తున్నట్టు పేర్కొంటున్నారు.

కమిటీల ఏర్పాటు నుంచి లబ్ధిదారుల ఎంపిక వరకు..

అధికార పార్టీకి చెందిన వారికి మాత్రమే ఇందరమ్మ ఇండ్ల పథకానికి లబ్ధిదారులుగా ఎంపిక చేస్తారా? అంటూ ప్రజలు ప్రభుత్వాన్ని, అధికారులను నిలదీస్తున్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకానికి లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి ప్రభుత్వం నియమించిన కమిటీల్లో అధికార పార్టీకి చెందిన వారే ఉండడంతో వారికి అనుకూలంగా ఉన్నవారిని మాత్రమే లబ్ధిదారులుగా ఎంపిక చేశారనే ఆరోపణలు ప్రజల నుంచి భారీగా వినిపిస్తున్నాయి. మరోపక్క ఏ పార్టీ అధికారంలో ఉన్న సంక్షేమ పథకాలను పార్టీలకు అతీతంగా అమలు చేయాల్సింది పోయి కేవలం రాజకీయాలు చేస్తున్నాయి తప్పాఅత్యంత నిరుపేదలను గుర్తించలేకపోతున్నాయని విమర్శలు సైతం వెల్లువెత్తుతున్నాయి. అధికార పార్టీ కేవలం స్థానిక సంస్థల్లో తమ పార్టీ నాయకులు విజయం సాధించేందుకే ఈ పథకాల డ్రామా అంటూ విమర్శలు చేస్తున్నారు.

మరోపక్క మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తున్నదని.. పార్టీల వారీగా వేరు చేస్తూ కేవలం కాంగ్రెస్ పార్టీకి చెందిన వారిని మాత్రమే ఆయా పథకాల ఫలాలను అందించేలా వ్యవహరిస్తున్నదని ఆరోపణలు వస్తున్నాయి. కమిటీల ఏర్పాటు మొదలుకొని లబ్ధిదారుల ఎంపిక వరకు అంతా కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉన్నవారికి ప్రయోజనం చేకూర్చేలా ముందుకెళ్తుండడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇండ్లు ఉన్నవారికే ఇండ్లు ఇస్తారా అంటూ అధికారులను నిలదీస్తున్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలోనూ ఎన్ఆర్ఈజీఎస్ లో పనులు చేయనటువంటి వారిని కూడా అధికారులు జాబితాలో పేర్లు చదవడం ఏమిటని మండిపడ్డారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిబంధనలు మిగతా వారికి వర్తించవా? అనే కోణంలో ప్రభుత్వంపై ప్రజలు తిరగబడుతున్నారు.

ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలపై ఇప్పటి వరకు ప్రభుత్వం నుండి లబ్ధిదారుల తుది జాబితాను విడుదల చేయలేదని ఇప్పటివరకు అధికారులు గ్రామ సభలలో చదివింది దరఖాస్తుదారుల జాబితా మాత్రమేనని ఓ టీవీ ఛానల్‌కు రాష్ట్ర డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క ప్రజలకు స్పష్టతనిచ్చారు. గణతంత్ర దినోత్సవం రోజున తుది జాబితా అనేది విడుదల చేస్తారని గంపెడాశతో ప్రజలు ఎదురు చూశారు. కానీ రాష్ట్ర వ్యాప్తంగా మండలానికో గ్రామాన్ని దశలవారీగా నాలుగు పథకాలను వర్తింపజేయడంపై ప్రజలు తిరగబడుతున్న పరిస్థితులు నెలకొంటున్నాయి. ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో పథకాల అమలుకు అడ్డుకట్ట పడనుంది.

గురుకుల పాఠశాలలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి పట్టణం శాంతినగర్‌లోని మహాత్మ జ్యోతి బాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో గురుకుల పాఠశాల నిర్వహణ, భోజనశాల, హాస్టల్ పరిస్థితుల వంటి అంశాలను ఆమె పరిశీలించారు. పాఠశాలలో వినియో గిస్తున్న బియ్యం, కూరగాయలు, పప్పులు, ఇతర కిరాణా సరుకుల నిల్వలను భద్రపరిచే స్టోర్ రూమును తనిఖీ చేశారు. బియ్యం నాణ్యతను స్వయంగా పరిశీలించిన కలెక్టర్ విద్యార్థులకు ఆరోగ్యకరమైన ఆహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బియ్యం తేమ గురించి ప్రత్యేకంగా ఆరా తీసిన కలెక్టర్.. తేమ చేరకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, సరైన రీతిలో నిల్వ చేయాలని సూచిం చారు. కొత్త మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాలు అందించాలని ఆదేశించారు . విద్యార్థులకు అందించే భోజనం మెనూ ప్రకారం ఉందో లేదో పరిశీలించారు. విద్యార్థుల నుండి ఆహార నాణ్యత, రుచిని గురించి ఫీడ్‌బ్యాక్ కూడా తీసుకున్నారు. డైనింగ్ హాల్, కిచెన్ షెడ్యూల్, ఆహారం తయారీ విధానాలు, ఉపయోగిస్తున్న పదార్థాల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు హాస్టల్ పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు. టెన్త్‌క్లాస్ విద్యార్థుల ప్రిపరేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పరీక్షల్లో మెరుగైన ఫలితాలను సాధించేందుకు విద్యార్థులకు అదనపు సాయం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దేవదాస్ ఆర్‌సిఓ గౌతం కుమార్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుదారులందరికీ డ్రిప్ పరికరాల పంపిణీ

జిల్లా హార్టికల్చర్ అధికారి సోమేశ్వరరావు

నవతెలంగాణ-జహీరాబాద్



డ్రిప్ పరికరాల కోసం గతంలో దరఖాస్తు చేసుకున్న వారందరికీ మంజూరు చేసినట్టు హార్టికల్చర్ జిల్లా అధికారి సోమేశ్వరరావు తెలిపారు. మండలంలోని రంజోల్ గ్రామ రైతులకు మంజూరైన డ్రిప్ పరికరాలు, అలాగే డ్రిప్‌పైప్‌లను బిగించుకున్న విధానాన్ని జహీరాబాద్ హార్టికల్చర్ అధికారి పండరితో కలిసి శుక్రవారం క్షేత్ర స్థాయి పర్యటన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 2,400 హెక్టార్ల విస్తీర్ణంలో డ్రిప్ మంజూరయ్యా యని.. ఇప్పటి వరకు 1300 హెక్టార్ల మేర డ్రిప్ సిస్టంను రైతులు బిగించుకున్నారన్నారు. మరో 1100హెక్టార్లలో 750 హెక్టార్ల మేర డ్రిప్ ప్రాసెస్‌లో ఉందన్నారు. తమ శాఖ మంజూరు చేసిన డ్రిప్ సిస్టంను రైతులు సద్వినియోగం చేసుకోవాలని, చెరుకు అల్లంతో పాటు ఆయిల్‌పామ్ పండించే రైతులకు సైతం డ్రిప్‌ను మంజూరు చేశామన్నారు. ప్రభుత్వం మంజూరు చేస్తున్న డ్రిప్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ డ్రిప్ ఇరిగేషన్ సంస్థల సిబ్బంది విజయ్, మాణయ్య, సతీష్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా యుద్ధనౌక గద్దర్ జయంతి వేడుకలు





నవతెలంగాణ-గుమ్మడిదల

గుమ్మడిదల మున్సిపాల్టీ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ప్రజా యుద్ధనౌక గద్దర్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ప్రజా యుద్ధనౌక, పాటల పెద్దన్న గద్దర్ అభిమాన సంఘం సభ్యులు, జన చైతన్య కళా సంస్థ అధ్యక్షుడు ముద్దంగుల ఎల్లయ్య మాట్లాడుతూ.. త్యాగాల మాగాణి పోరాటాల సూర్యుడు, ఉద్యమాల తొలి పొద్దు ప్రశ్నించె గొంతు, పాటల పూతోట మలిదశ తెలంగాణ ఉద్యమంలో యావత్ ప్రపంచ స్థాయిలో ఓ వేలుగు వెలిగిన దళిత బహుజన ఉద్యమ కెరటం గద్దర్‌తో కలిసున్న జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఆయన ఆశయాల పల్లకిని మోసుకెళ్తామని ఆత్మీయ ఘన నివాళులు తెలిపారు. అ కార్య క్రమంలో తుడుం శ్రీనివాస్, నీరుడి రమేష్, శివకుమార్, తేలు నరసింహ, బొమ్మల మైసయ్య, తాజ మాజీ సర్పంచ్ చిమ్ముల నరసింహా రెడ్డి, రాష్ట్ర యువజన సంఘాల సమితి ప్రతినిధులు భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డి : సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సంఘం జిల్లా కార్యాలయంలో ప్రజా యుద్ధనౌక గద్దర్ 77వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అంబేద్కర్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు కొండాపురం జగన్, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు పంబల దుర్గాప్రసాద్, గౌర అధ్యక్షులు బైండ్ల అశోక్ కుమార్, బహుజన నాయకులు గోపులారం ప్రేమానందం, ఎంపీటీసీ నందకిషోర్, జిల్లా కార్యదర్శి జోగ్యల్ల రాజు, సోషల్ మీడియా కన్వీనర్ పురుషోత్తం, సాగర్, ప్రమోద్,రమేష్,శేఖర్, సదానందం, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రాపురం : తెలంగాణ సాయుధ పోరాట ఉద్యమకారుడు ప్రజా నాయకుడు గద్దర్ ఆశయాలను నెరవేర్చేందుకు ప్రయత్నిస్తామని తెల్లాపూర్ మాజీ కౌన్సిలర్ భరత్ అన్నారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో గద్దర్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి మాజీ కౌన్సిలర్ భరత్ మరియు నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా భారత్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాట ఉద్యమ కారుడు గద్దర్ ఆశయ సాధనకు తమ శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని అన్నారు. తన పాటలతో ఎందరినో చైతన్యపరిచి తెలంగాణ ఉద్యమంలో పాల్గొనేలా చేసిన మహనీయుడు గద్దర్ అని అన్నారు.

ఆలయాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం

నవతెలంగాణ-రామచంద్రాపురం



నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని వెలిమెల గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ కామారతి సమేత బీరప్ప స్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానసిక ప్రశాంతత కోసం ప్రతి ఒక్కరూ దైవచింతనను పెంపొందించుకోవాలని కోరారు. నియోజకవర్గం వ్యాప్తంగా పరమత సహనాన్ని పెంపొందిస్తూ ఆలయాలు చర్చిలు మసీదులు నిర్మి స్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తెల్లాపూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మెన్ రాములు గౌడ్, సర్పంచుల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సోమిరెడ్డి,. మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, గూడెం మధు సూదన్ రెడ్డి, ఆదర్శ్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు రవీందర్ రెడ్డి, కొమరయ్య, శ్యామ్ రావు, ఉమేష్, శ్రీనివాస్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు సన్మానం



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

రోడ్డు భద్రతా మహోత్సవాల్లో భాగంగా ఆర్టీసీ ఉద్యోగులను ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి సన్మానించారు. నెల రోజులపాటు జరిగిన రోడ్డు భద్రత మాస ఉత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఈ ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉత్తమ ఎలక్ట్రీషన్‌గా కిషన్ ప్రసాద్, ఉత్తమ కెఎమ్పిఎల్‌గా మెకానిక్ నరసింహులు, ఉత్తమ డ్రైవరులుగా ఎలాంటి యాక్సిడెంట్ లేకుండా మంచి డిజిల్ ఆదా సాధించిన ఎస్‌కే సయ్యద్, మల్లయ్య, పి సంగయ్యను డిపో మేనేజర్ మల్లేశంతో కలిసి ఘనంగా సన్మానించి ప్రశంసా పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మెన్ దారం శంకర్ సెట్, ఎంఈ ఓ నాగారం శ్రీని వాస్ అసిస్టెంట్ మేనేజర్ నరసిం హులు మెకానికల్ ఇంజనీర్, దశరథరావు, ఎస్‌టీఐ నందు లల్ డీసీస్ రాములు సెక్యూరిటీ ఎట్ కానిస్టేబుల్ సత్యనారాయణ, భాస్కర్, విట్టల్, రాధాకృష్ణ, శివశంకర్ డిపో ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడితే కఠిన చర్యలు తప్పవు

- పర్యావరణాన్ని కాపాడుకుందాం
- ఖేడ్ సుందరీకరణకు ప్రజలు సహకరించాలి
- మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధిస్తున్నామని.. వాడితే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ జై జగ్జీవన్ అన్నారు. పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని, నారాయణఖేడ్ పట్టణాన్ని అభివృద్ధి వైపు తీసుకెళ్దామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నారాయణఖేడ్ పట్టణంలో చెత్తాచెదారం లేకుండా ఉద యం, సాయంత్రం చెత్త బండ్లను పంపిస్తున్నావన్నారు. చెత్తను తప్పనిసరిగా చెత్త సేకరణలో వాహనాలకే ఇవ్వా లని.. ఎక్కడ పడితే అక్కడ వేయొద్దన్నారు. పొడి, తడి చెత్త వేరువేరుగా సేకరించి అందజేయాలన్నారు. అలాగే ప్లాస్టిక్ వాడొద్దని వాడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్లాస్టిక్ వాడటం వల్ల పర్యావరణ దెబ్బ తింటుందని దాని ప్రభావం ప్రజలపై పడుతుందన్నారు. ప్లాస్టిక్ వాడకుండా ఉండాలని దుకాణదారులకు పత్రిక ప్రకటన ద్వారా తెలుపుతున్నామ న్నా రు. పట్టణం పరిశుభ్రంగా ఉంటే ప్లాస్టిక్ వాడకుండా ఉంటే నారాయ ణఖేడ్ సుందరంగా ఉంటుందన్నారు. ఎమ్మెల్యే సహకారంతో రూ.20కోట్లతో అభివృద్ధి కార్యక్ర మాలు పట్టణంలో జరుగుతున్నాయన్నారు. పట్టణంలో మరింత అభివృద్ధి కోసం రింగ్ రోడ్డు, లింక్ రోడ్లు వేస్తున్నా మన్నారు. సిసి రోడ్లు, మురికి కాలువలు అన్ని కాలనీలలో వేస్తున్నా మన్నారు. ప్రజలు సహకరిస్తే మరింత అభివృద్ధికి కృషి చేస్తా మన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ శివ, అంబేద్కర్ యు వజన సంఘం అధ్యక్షులు కాన్సిరాం, నరసింహులు, నవతెలంగాణ విలేకరి సిద్ధిరాములు పాల్గొన్నారు.

ప్రమాదంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

నవతెలంగాణ-న్యాల్‌కల్



న్యాల్‌కల్ మండలంలో రత్నాపూర్ గ్రామం నుంచి డప్పూర్ వెళ్లే మార్గంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ బేస్‌మెంట్ గోడ ధ్వంసమై ప్రమాదకర పరిస్థితి ఏర్ప డింది. నేలపైనే ట్రాన్స్‌ఫార్మర్ ఉండ డంతో.. స్థానిక రైతులు, ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితి ఇలానే ఉండి నెలలు గడుస్తున్నా.. విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. రైతులతో పాటు.. పశువులు కూడా విద్యుద్ఘాతానికి గురయ్యే ప్రమాదమున్నదని.. వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. అలాగే రత్నాపూర్ గ్రామ శివారులో ఇండ్ల మధ్యలో విద్యుత్ తీగలు వేలాడుతూ ప్రమాద స్థితిలో ఉన్నాయని.. వెంటనే బాగు చేయాలని స్థానిక యువకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నవతెలంగాణ
మెదక్
శనివారం | 01 ఫిబ్రవరి 2025 | www.navatelangana.com

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అమూల్యమైనది

- డీఈఓ డాక్టర్ రాధా కిషన్



నవతెలంగాణ-చేగుంట

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు చాలా అమూల్యమైనదని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని డీఈఓ డాక్టర్ రాధా కిషన్ పేర్కొన్నారు. మండలంలోని చందాయిపేట జెడ్పీహెచ్ఎస్‌లో శుక్రవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఈఓ డాక్టర్ రాధా కిషన్ హాజరై విద్యార్థులతో పాటు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎంపీడీవో చెన్నారెడ్డి, ఎంఈఓ నీరజలు పాల్గొని మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు చాలా విలువైనదన్నారు. పాఠశాలలో మాక్ పోలింగ్ నిర్వహించడం ద్వారా ఓటింగ్ విధానం గురించి, ఓటింగ్ సిబ్బంది విధుల గురించి, ఓట్ల లెక్కింపు గురించి విద్యార్థులకు అవగాహన కలుగుతుందన్నారు. డిప్యూటీ ఎమ్మార్వో శ్రీకాంత్ పాల్గొని ఓటు హక్కు వినియోగించుకుని మాట్లాడారు. ఇటువంటి కార్యక్రమాలు చేయడం ద్వారా ప్రజలలో ఓటు హక్కు పై అవగాహన కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీ కిషన్, కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు అమర్ శేఖర్ రెడ్డి, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు అజిత, యాదగిరి, తపస్ మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్,వరాల నర్సింలు, విఠల్ రెడ్డి, శంకర్, సలీం, సిద్ధిరాములు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల కోసం పోలింగ్ బూత్‌ల పరిశీలన

- తహశీల్దార్ తులసి రామ్



నవతెలంగాణ-టేక్మాల్

ఉపాధ్యాయ, పట్టభద్రుల, ఎమ్మెల్సీ ఎన్నికల కోసం శుక్రవారం టేక్మాల్ బాలుర ఉన్నత పాఠశాలలో ఉన్న గదులను తహశీల్దార్ తులసిరావమ్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ పట్టభద్రుల ఎన్నికలు నిర్వహించడం కోసం ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. అందుకోసం ప్రభుత్వాధికారులను సమయత్వం చేస్తుందని చెప్పారు. ఎన్నికల నిర్వహణ కోసం ప్రజలకు అందుబాటులో ఉన్న గదులను పరిశీలించి, ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నట్లు ఆయన తెలిపారు. పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సాయి శ్రీకాంత్, తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది. ఉపాధ్యాయులు ఉన్నారు.

తొలి మున్సిపల్ చైర్మెన్‌ను సన్మానించిన కేటీఆర్



నవతెలంగాణ-తూప్రాన్

తూప్రాన్ తొలి మున్సిపల్ చైర్మన్ రవీందర్ గౌడ్‌ను కేటీఆర్ శుక్రవారం సన్మానించారు. మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు నడిపించి, 2 సార్లు మున్సిపల్ స్థాయిలో జాతీయ, రాష్ట్రస్థాయి అవార్డులు అందుకున్న సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణ భవన్‌లో రవీందర్ గౌడ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారిని దర్శించుకున్న

- మాజీ ఎమ్మెల్యే మైనపల్లి హనుమంత రావు



నవతెలంగాణ-చేగుంట

చేగుంట మండలం కర్ణంపల్లి శ్రీ రేణుక ఎల్లమ్మ జాతర సందర్భంగా మాఘఅమావాస్యను పురస్కరించుకొని శుక్రవారం మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డితో కలిసి దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ అమ్మవారిని దర్శించుకున్నందుకు సంతోషంగా ఉందని రాష్ట్రంలోని ప్రజలందరూ సుభిక్షంగా, సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఉండాలని, కోరుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్ సీనియర్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, జిల్లా సీనియర్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,పాల్గొన్నారు.

పిల్లుట్ల మల్లన్న జాతరకు సర్వం సిద్ధం

- నేటి నుంచి జాతర ఉత్సవాలు షురూ



నవతెలంగాణ-శివ్వంపేట

మండలంలోని పిల్లుట్ల గ్రామంలో వెలసిన శ్రీమల్లిఖార్జున స్వామి జాతర మహెూత్సవాల కోసం యాదవ సంఘం ఆధ్వర్యంలో సర్వం సిద్ధం చేశామని నిర్వాహకులు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్నిరకాల ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. శనివారం ప్రత్యేక పూజలు, గంగస్నానం, 2న ఆదివారం అగ్ని గుండాలు, మల్లన్న కళ్యాణం, 3న సోమవారం స్వామివారి నాగవెల్లి, ఒగ్గు కథలు, 4న రేణుక ఎల్లమ్మ తల్లికి బోనాలు సమర్పించడం జరుగుతుందన్నారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడ మల్లన్న జాతర ఉత్సవాలను బ్రహ్మాండంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. జాతర ఉత్సవాలకు ఎమ్మెల్యే సునీతారెడ్డి, ఎంపీ రఘునం దన్ రావు, గ్రంథాలయ చైర్ పర్సన్ సుహాసిని రెడ్డి, కాంగ్రెస్ ఇంచార్జి రాజిరెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు మురళీ యాదవ్, వాల్దాస్ మల్లేష్ గౌడ్ ముఖ్య అతిథులు గా హాజరు కానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జాతర ఉత్సవాలకు జిల్లాలోని స్వామివారి భక్తులందరూ అధిక సంఖ్యలో హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

మతసామరస్యానికి ప్రతిక టేక్మాల్ శాహేదల్లా ఉత్సవాలు

- ఖాద్రీ ఉర్సు ఉత్సవాలు



నవతెలంగాణ-టేక్మాల్

విశ్వమే తన కుటుంబం, ప్రేమనే మతం, మానవత్వానికి దైవత్వానికి అను సందానమే భక్తి, అనే నానుడిని చాటుతూ. చిన్న, పెద్ద, తారతమ్యం లేకుండా అన్ని మతాల వారిని ఒక్క చోటకు చేర్చి. భగవంతుని దృష్టిలో మానవులు అందరూ సమానులు అని చాటి చెప్పే ఫీర్ షాహ్ మహమ్మద్, మారుఫ్ హజ్రత్ శాహెదల్లా ఖాద్రీ ఉర్సు ఉత్సవాలు ఫిబ్రవరి 2వ తేదిన టేక్మాల్ దర్గా ఆశ్రమంలో ప్రారంభం కానున్నాయి. జరగనున్నాయి. ఉర్సు ఉత్సవాలు ప్రారంభ సూచకంగా 2వ తేదిన పట్టణంలోని క్రింది వాడ (గల్లీ) నుంచి గ్రంథం ఊరేగింపు నిర్వహిపస్తారు. 3వ తేదిన హమ్ దావత్, ఖవ్వాలి, నాతే మైఫీల్, ధార్మిక, ప్రవచనాలు, నాతే ముశాయిరా, 4వ తేదిన వితరణ కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు ఖాద్రి తెలిపారు. శాహెదల్లా ఖాద్రీ దర్గా ఉర్సు ఉత్సవాల కోసం కర్ణాటక, మహారాష్ట్ర, ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్, గుల్బర్గా, బీదర్, ప్రాంతాలతో పాటు, విదేశాల నుంచి వచ్చే భక్తుల కోసం ప్రత్యేక వసతులు, ఉచిత భోజనం, మంచి నీళ్ల సదుపాయాలు తదితర ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. భక్తులు ఉర్సు ఉత్సవాల్లో అధిక సంఖ్యలో పాల్గొన్ని విజయ వంతం చేయాలని నూరుల్లా హుస్సేని ఖాద్రీ కొరారు.

ఉర్సు ఉత్సవాలను అధికారికంగా జరపాలి

దేశ వ్యాప్తంగా ఎంతో పేరు ప్రఖ్యాతులు సంతరించుకున్న టేక్మాల్ శాహెదల్లా ఖాద్రీ ఉర్సు ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వమించాలని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం చైర్మన్ షేక్ మజ్హార్ కోరారు. ఈ మేరకు తాము మంత్రి దామోదర రాజనరసింహ దృష్టికి తీసుకెళుతున్నట్లు తెలిపారు.

దుర్గమ్మ దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ

- ప్రత్యేక పూజలో పాల్గొన్న ఉమ్మడి మండలాల పీఏసీఎస్ చైర్మెన్



నవతెలంగాణ-మనోహరాబాద్

దుర్గమ్మ దేవాలయంలో శుక్రవారం ఘనంగా నూతన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వాహకులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని దండుపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన దుర్గమ్మ దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించగా ఉమ్మడి మండలాల పీఏసీఎస్ చైర్మన్ మెట్టు బాలక్రిష్టారెడ్డి దర్శించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దుర్గాదేవి ఆశిస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆయన ఆకాంక్షించారు. .ఈ కార్యక్రమంలో చెట్లగౌరారం మాజీ ఉపసర్పంచ్ శ్రీహరిగౌడ్, రంగాయిపల్లి తాజా మాజీ ఉపసర్పంచ్ నవీన్, నాయకులు రమేష్ తదితరులు ప్రత్యేక పూజల్లో పాల్గొనగా ఆలయ నిర్వాహకులు నరేష్‌గౌడ్ వారికి ఘనంగా శాలువాలతో సన్మానించారు.

చిరుత పులికి పోస్ట్ మార్టం, దహనం



నవతెలంగాణ-నార్సింగి

రోడ్డు ప్రమాదంలో గురువారం మృతి చెందిన చిరుత పులి దహన సంస్కారాలు మండల పరిధిలోని వల్లూరు అటవీ ప్రాంతంలో శుక్రవారం నిర్వహించారు. ఈ నెల 30న రాత్రి 7:30 గం.ల ప్రాంతంలో మండల పరిధి జాతీయ రహదారి 44 వల్లూరు వద్ద రోడ్డు దాటుతున్న క్రమంలో చిరుత పులిని గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో చిరుతకు వెనుక భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. గాయాల పాలై రోడ్డు పై ఉన్న క్రమంలో మరో వాహనం ఢీ కొట్టడంతో చిరుత పులి మృతి చెందింది. మెదక్ జిల్లా అటవీ అధికారి (డీ.ఎఫ్.ఓ) జోజీ, రామాయంపేట రేంజ్ అధికారి విద్యాసాగర్, స్థానిక ఎస్ఐ అహ్మద్ మోహిఉద్దీన్ సమక్షంలో వెటర్నరీ వైద్య బృందం మృతి చెందిన చిరుతకు వల్లూరు అటవీ ప్రాంతంలో శుక్రవారం పోస్ట్ మార్టం నిర్వహించి అనంతరం దహనం చేశారు. ఈ సందర్భంగా డీ.ఎఫ్.ఓ జోజీ మాట్లాడుతూ "నేషనల్ టైగర్ కన్సర్వేషన్ అథారిటీ" (ఎన్.టీ.సీ.ఏ) చట్టం ప్రకారం అధికారుల సమక్షంలో వెటర్నరీ బృందంతో పోస్ట్ మార్టం నిర్వహించి, చట్ట ప్రకారమే దహనం చేశామని తెలిపారు. జాతీయ రహదారి 44పై అటవీ ప్రాంతంలో అటవీ జంతువులకు రోడ్లు దాటడానికి అండర్ పాస్ ల నిర్మాణం చేయలేదని, అండర్ పాస్‌ల నిర్మాణం కొరకు, అలాగే రహదారిపై జంతు సంచార సంబంధిత ఫోటోలు ఏర్పాటు చేయాలని, జాతీయ రహదారి శాఖ అధికారులకు కోరుతూ లేఖ రాస్తున్నట్లు తెలిపారు. ప్రమాదంలో చిరుత మృతి చెందడంపై దర్యాప్తు చేస్తున్నామని, తదుపరి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని జోజీ తెలిపారు.

క్రీడలలో గెలుపోటములు సహజం

- ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రమేష్‌కు అభినందనలు
- ఎంఈఓ పర్వతి సత్యనారాయణ



నవతెలంగాణ-తూప్రాన్

క్రీడలలో గెలుపు ఓటములు సహజమేనని, ఓడినవారు నిరుత్సాహ పడకుండా కృషి, పట్టుదలతో విజయాలను సాధించడానికి నిరంతరం సాధన చేయాలని ఎంఈఓ డా.పర్వతి సత్యనారాయణ అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ అండర్ 14 బాల బాలికల క్రీడోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యా రు. విజేతలైన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పర్వతి సత్యనారాయణ మాట్లాడుతూ క్రీడాకారులు ఆటలలో రాణించడం వల్ల మంచి భవిష్యత్తు ఉంటుందని, ప్రభుత్వం అన్ని విద్యా, ఉద్యోగ రంగాలలో రిజర్వేషన్ సౌకర్యం కల్పించి ప్రోత్సహిస్తుందని తెలిపారు. క్రీడాకారులు క్రీడలలో మంచి నైపుణ్యాలను సాధించడానికి ప్రణాళికతో కూడిన శిక్షణ తీసుకోవాలన్నారు. పాఠశాల క్రీడా సమాఖ్య, మెదక్ జిల్లా ఆధ్వర్యంలో పట్టణంలో రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలు విజయవంతంగా నిర్వహించడం పట్ల జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ రమేష్ గంగాలను అభినందించారు. రాష్ట్రంలోని ఉమ్మడి 10 జిల్లాల క్రీడాకారులకు తూప్రాన్ పట్టణం వేదిక కావడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో క్రీడల నిర్వహణకు ముందుకు వచ్చే వారికి తమ సహకారం ఎప్పుడూ ఉంటుందని ఎంఈఓ సత్యనారాయణ తెలిపారు. అనంతరం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మెదక్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ రమేష్ గంగాల మాట్లాడుతూ జిల్లా విద్యాధికారి ప్రో. డి.రాధాకిషన్ సహకారంతో ఈ విద్యా సంవత్సరంలో జిల్లాలో ఫుట్ బాల్, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, సాఫ్ట్ బాల్ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను విజయవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉమ్మడి 10 జిల్లాల నుంచి 300 మంది క్రీడాకారులు, 40 మంది కోచ్, మేనేజర్లు పాల్గొన్నారని, క్రీడోత్సావాల నిర్వహణకుగాను జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న వ్యాయమ ఉపాధ్యాయుల సేవలను వినియోగించుకుని విజయవంతంగా పూర్తిచేశామ న్నారు. ఫిబ్రవరిలో జరిగే సాఫ్ట్ బాల్ జాతీయ స్థాయి క్రీడోత్సవాలలో పాల్గొనే అండర్ 14 బాల, బాలికల తెలంగాణ రాష్ట్ర జట్టుకు ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకా రులను గుర్తించి ఎంపికచేయడం జరిగిందన్నారు. ఈ కార్య క్రమంలో ఒలింపియా ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ వెంకటేష్, టోర్నమెంట్ కో ఆర్డినేటర్ శ్యామ్ సుందర్ శర్మ, గోవర్ధన్, రాష్ట్ర పరిశీలకులు గంగ మోహన్, రవికుమార్, ఫిజికల్ డైరెక్టర్లు చంద్రమోహన్,పద్మ, మాలతి, లతిఫా ఉన్నిసా, మంజుల, సరోజినీ, శంకర్, మధు, కిరణ్,వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెూరా హెూరీగా సాగిన మెదక్, నిజామాబాద్ జట్ల మధ్యపోరు

రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలలో బాలుర ఫైనల్ మ్యాచ్ మెదక్, నిజామాబాద్ జట్ల మధ్య హెూరాహెూరీగా కొనసాగింది. ఇరు జట్ల మధ్య మూడు పర్యాయాలు జరిగిన మ్యాచ్‌లలో రెండు జట్లూ సమాన స్కోర్ సాధించి బరిలో నిలవడం, ఫలితం తేలక పోవడంతో ఎంతో ఉత్కంఠత నెలకొంది. చివరగా జరిగిన మ్యాచ్లో నిజామాబాద్ 6 పాయింట్లు, మెదక్ 5 పాయింట్లు సాధించడంతో నిజామాబాద్ జిల్లా జట్టు ప్రథమ స్థానం, మెదక్ జిల్లా జట్టు ద్వితీయ స్థానం సాధించగా, తృతీయ స్థానంలో ఆదిలాబాద్ జిల్లా జట్టు నిలిచింది. బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో నిజామాబాద్ జిల్లా జట్టు, ద్వితీయ స్థానంలో మహబూబ్ నగర్, తృతీయ స్థానంలో ఆదిలాబాద్ జిల్లా జట్లు గెలిచాయి. విజేతలైన క్రీడాకారులు బహుమతులు అందుకున్నారు.

ఎస్సీ వర్గీకరణ చేయాల్సిందే

నవతెలంగాణ-టేక్మాల్

అన్ని విధాలుగా మాదిగలు మాదిగ ఉపకులాలు వెనుకబడ్డాయని, ఆ వర్గాల వారు అభివృద్ధి చెందాలంటే తప్పనిసరిగా ఎస్సీ వర్గీకరణ చేయాల్సిందేనని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు బొబ్బిలి సుధాకర్ అన్నారు. శుక్రవారం టేక్మాల్ చౌరస్తా నుంచి టేక్మాల్ పట్టణ పురవీధుల గుండా డప్పు సప్పులు డీజే సౌండ్ తో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన. మాట్లాడారు. గత 30 సంవత్సరాలుగా ఎస్సీ వర్గీకరణ చేయాలని మందకృష్ణ మాదిగ పోరాడుతున్నాడని, ఆయనకు తోడుగా మాదిగ, మాదిగ ఉపకులాలు మద్దతు తెలుపుతూ అనేక రూపాల్లో, నిరసనలు ర్యాలీలు చేపడుతున్నామన్నారు. ప్రభుత్వాలు పాలకులు పట్టించుకోక పోవడమే కాదని, అన్ని విధాలుగా మాలలు రాజకీయంగా ఆర్థికంగా సామాజికంగా మాదిగ ఉపకులాలను తొక్కేస్తున్నారన్నారు. మాదిగలు మాదిగ ఉపకులాలకు రావలసిన అన్ని రకాల రిజర్వేషన్లను మాలలు అడ్డుకుంటున్నారన్నారు. తరతరాలుగా వారితో కలిసి ఉన్నప్పటికిని తమకు తమ పిల్లలకు న్యాయం జరగడం లేదన్నారు. న్యాయ పోరాటం చేస్తూ కేంద్రం బిజెపి సపోర్టుతో పార్లమెంటులో బిల్లు పాస్ చేసుకున్నప్పటికిని కోర్టులు బిల్లులు మంజూరు చేసినప్పటికిని రిజర్వేషన్లను మాలలు అడ్డుకుంటున్నారని చెప్పారు. తాడోపేడో తేల్చుకోవడం కోసం మందకృష్ణకు తోడుగా నడుస్తున్నామన్నారు. ఇప్పుడు రిజర్వేషన్ కాకుంటే ఎప్పుడు కాదని తమ మాదిగ కులాలను ఒక తాటికి తీసుకురావడం కోసం నిరంతరం ప్రజల్లో ఉంటూ డప్పులు, మేళ వాయిద్యాలతో నిరసనలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో చింత రవి, ఎల్లయ్య, శివకుమార్, అనిల్, రొడ్డ సాయిలు, సూరంపల్లి సాయిలు, తదితరులు ఉన్నారు



పశువైద్య శిబిరాల ఏర్పాటు అభినందనీయం

- జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ వెంకటయ్య



నవతెలంగాణ-శివ్వంపేట

పశు సంపదను కాపాడుకొనుటకు గోపాలమిత్ర ద్వారా గ్రామాలలో ఏర్పాటు చేస్తున్న ఉచిత పశువైద్య శిబిరాలకు అపూర్వ స్పందన లభిస్తోందని పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి డాక్టర్ వెంకటయ్య తెలిపారు. శుక్రవారం గోపాలమిత్ర ఆధ్వర్యంలో మండలంలోని లచ్చిరెడ్డిగూడెంలో ఉచిత పశువైద్య శిబిరానికి జిల్లా జేడీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా డాక్టర్ వెంకటయ్య మాట్లాడుతూ ప్రతి నిత్యం పశు ఆరోగ్య సేవలకు గోపాల మిత్ర సిబ్బంది అందిస్తున్న సేవలు ఎంతో భేష్ అన్నారు. ఉచిత పశు వైద్య శిబిరాలను అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామంలోని 38 ఆవులు, దూడలకు చూడి పరీక్షలు, 5 గేదెలకు కృత్రిమ గర్భాధారణ, 18 దూడలకు నట్టల మందులు, 9 పశువులకు సాధారణ చికిత్సలను అందించడం జరిగినదని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఏడి డాక్టర్ జనార్దన్, వెటర్నరీ అసిస్టెంట్లు డాక్టర్ వినోద్ కుమార్, ప్రియాంక, స్వప్న, గోపాలమిత్ర సూపర్ వైసర్ మన్నెగల్ల సత్యనారాయణ, వీఏ భాగ్యలక్ష్మి, గోపాలమిత్ర శ్రీనివాస్, రైతులు శ్రీకాంత్ రెడ్డి, నర్సింహారెడ్డి,మల్లేష్, రాజు, మాణిక్యరెడ్డి, దయాకర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి సైన్సు టాలెంట్ టెస్ట్

- మండల విద్యాధికారి యాదగిరి



నవతెలంగాణ-వెల్దుర్తి

విద్యార్థుల్లో దాగి ఉన్న శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొదించడానికి భౌతిక రసాయన సైన్సు టాలెంట్ టెస్ట్ ఎంతో ఉపయోగపడుతుందని మండల విద్యాధికారి యాదగిరి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు భౌతిక రసాయన సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించడం జరిగిందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాంబయ్య తెలిపారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడారు. సైన్సు టెస్టులు విద్యార్థుల విద్యా పనితీరును మెరుగుపరచడానికి వారిలో దాగి ఉన్న శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి తార్కనికం అభివృద్ధి చేయడానికి సహాయపడతాయన్నారు. మూఢ నమ్మకాలను పారద్రోలెందుకు సైన్స్ పై అవగాహన ముఖ్యమన్నారు. మండల స్థాయి భౌతిక రసాయన టాలెంట్ టెస్ట్‌లో మొదటి బహుమతి శ్రీచరణ్ గౌడ్, రెండో బహుమతి హెచ్ చంద్ర వర్ధన్ గౌడ్, మూడో బహుమతి కార్తీక్‌లు గెలుపొందారు. వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెల్దుర్తి. పాఠశాల ఉపాధ్యాయులు వెంకటస్వామి, చార్లెస్, అక్బర్, సోనీ, పోచయ్య, పద్మారావు, చందర్, తదితరులు పాల్గొన్నారు.

10 నెలల్లో రూ.5 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం

- మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ మామిండ్ల జ్యోతి కృష్ణ ముదిరాజ్



నవతెలంగాణ-తూప్రాన్

తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలో పది నెలల కాలంలోనే రూ 5 కోట్ల బడ్జెట్‌తో అభివృద్ధి పనులు చేపట్టామని మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ మామిండ్ల జ్యోతి కృష్ణ ముదిరాజ్ తెలిపారు. పలు వార్డులలో ఎన్నో రకాల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డిల సహకారంతో మంజూరైన రూ.5 కోట్ల పనులు చేపట్టినట్లు తెలిపారు. రూ.3.5 కోట్ల 15వ ఫైనాన్స్ పట్టణ ప్రగతి నిధులతో పాటు రూ.1.5 కోట్ల స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్స్ వినియోగించుకొని అన్ని వార్డులలో డ్రైనేజీ పనులు,సీసీ రోడ్లు, ఓపెన్ డ్రైన్ స్లాబ్‌లు, డంప్ యార్డు నిర్మాణాలు, వీధి దీపాల ఏర్పాట్లు, పలు వార్డుల లోని స్మశాన వాటికల రిపేర్ వంటి పనులు, ఇతర ఎన్నో రకాల అభివృద్ధి పనులను చేపట్టి నట్లు తెలిపారు. గతంలో నాలు గు సంవత్సరాలలో చేయని అభివృద్ధిని పది నెలల కాలంలోనే వేగవంతంగా పనులు చేపట్టి పూర్తి చేసినట్లు తెలిపారు. పట్టణంలో చేసిన అభివృద్ధికిగాను జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో అవార్డులు వచ్చాయని పేర్కొన్నారు. ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వం అందించిన జాతీయస్థాయి అవార్డు ఇందుకు ప్రధాన నిదర్శనమన్నారు. భవిష్యత్తులో తూప్రాన్ మున్సిపాలిటీ మరింత అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేస్తామని చెప్పారు. తన పదవీ కాలంలో సహకరించిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం సహాయనిధి పేదల పాలిట వరం

- కాంగ్రెస్ మండల అధ్యక్షులు మల్లేశం గౌడ్

నవతెలంగాణ-కొల్చారం

సీఎం సహాయనిధి పేదల పాలిట వరం లాంటిదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మల్లేశం గౌడ్ అన్నారు. సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చిక్కులను లబ్దిదారు లకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి సహకారంతో మండలం లోని తుక్కాపూ ర్ గ్రామానికి ఆయిలి శివాజీ రూ. 57500, ఆయిలీ శేఖర్ రూ.28500, బ్యాగరి ధనరాజ్ రూ. 25500 మంజూరు అయ్యాయని తెలిపారు. అలాగే సంగాయిపేట గ్రామానికి చెందిన ఆకుల మల్లేశం రూ. 55000 మంజూరు అయ్యాయని వారి ఇంటి వద్దకు వెళ్లి చెక్కులను అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మధుసూదన్ రెడ్డి, మరెల్లి అనిల్, గోవర్ధన్, తుక్కాపూర్ మాజీ సర్పంచ్ మాధవి శ్రీశైలం, ఆయిలి రాములు, బందెల శ్రీను, ఆయిలి యాదగిరి, నవీన్ కుమార్, కృష్ణ, రమేష్, గంగయ్య, భూమయ్య, శివకుమార్, కార్తిక్ రాజు పాల్గొన్నారు.



ముద్దుబిడ్డ గద్దర్ 77వ జయంతి వేడుకలు





నవతెలంగాణ-నిజాంపేట:మండల కేంద్రంలోని నూతన బస్టాండ్ ఆవరణలో ప్రజాయుద్ధ నౌక గద్దర్ అలియాస్ గుమ్మడి విట్టల్ 77వ జయంతి ఉత్సవాలను పార్టీలక తీతంగా ప్రజా సంఘాలు, దళిత సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాలు, దళిత సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ ప్రజా యుద్ధనౌక గద్దర్ విప్లవ జీవితంలో పీడిత ప్రజల కోసం అనేక ఆటుపోట్లు ఎదుర్కొని పేద ప్రజల అభ్యున్నతి కోసం అనేక పోరాటాలు చేశారన్నారు. అనేక పాటలు రాసి కవి, వాగ్గేయకారుడు, పీడిత ప్రజల తరపున అలుపెరుగని పోరాటం చేసిన ఉద్యమ వీరుడ న్నారు. సమ సమాజ నిర్మాణమే లక్ష్యంగా. తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమంలో ప్రజలను చైతన్యవంతం చేసి, దొరల పాలన అంతం చేయడంలో తన కాళ్లకు గజ్జలు కట్టి ఆట, పాట ద్వారా ప్రశ్నించే గొంతుకై నిలిచారన్నారు. ప్రజా పాలనను తీసుకు రావడంలో తను వంతు కృషి చేసిన గొప్ప మహనీయుడని కొనియాడారు. ఆయనపై బీజేపీ కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యల ను వారు ఖండించారు. పంచశీల రాజ్యాంగాన్ని పట్టుకొని రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందాం, రాజ్యాంగాన్ని కాపాడుకుందామనే అంశంతో ప్రజలను ఏకం చేసిన గొప్ప మహనీయుడన్నారు. ఈ కార్యక్రమంలో బాబు, గరుగుల శ్రీనివాస్, మారుతి, నసీరుద్దీన్, రవీందర్, అమర్, బ్యాగరి రాజు, మోహన్ రెడ్డి, శ్యామల మహేష్, స్వామి, వల్లపు స్వామి, పాల్గొన్నారు.

నవతెలంగాణ-తూప్రాన్ : తూప్రాన్ ముద్దు బిడ్డ, ఉద్యమాల పోరుబిడ్డ, ప్రజాగాయకుడు, మహానేత గుమ్మడి విఠల్ రావు గద్దర్ 77వ జయంతి వేడుకలు శుక్రవారం ఉదయం తూప్రాన్ బస్టాండ్‌లోని డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. గద్దర్ అమర్ హై అంటూ నినదిస్తూ ఆయన సేవలను గుర్తు చేశారు. గద్దర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మన్నె శ్రీనివాస్ రావు, సామల అశోక్, పర్శ నర్సింగ్ రావు, ఏర్పుల రాము, ఏర్పులా బాలరాజు, ప్రవీణ్ కుమార్, చిట్టిమిల్ల అనిల్ కుమార్, సత్తయ్య, రాములు, చిన్నలింగ్ మల్లిఖార్జున్ గౌడ్, జీడిపల్లి బాలయ్య, సాయి సమ్మర్, సత్యనారాయణ, భాను, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కులమత భేదాలు లేకుండా కలిసి మెలసి ఉండాలి

- ఎస్ఐ సుభాష్‌గౌడ్

నవతెలంగాణ-మనోహరాబాద్

కులమత భేదాలు లేకుండా ప్రతి ఒక్కరు అన్నదమ్ముల్లాగా కలిసి మెలసి ఉండాలని మనోహరాబాద్ ఎస్ ఐ సుభాష్‌గౌడ్ సూచించారు. శుక్రవారం మనోహరాబాద్ మండల కేంద్రంలో సివిల్ రైట్స్ డేను రెవెన్యూ అధికారులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరు సమానమేనని కలిసి మెలసి ఉండాలని సూచించారు. ఎవరినైనా కులం పేరుతో దూషించినా వారిపై చట్టపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు. గ్రామంలో ఎక్కడైనా రెండు గ్లాసుల పద్ధతి ఉందా అని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో తామంతా కులమత భేదాలు లేకుండా కలిసి, మెలసి ఉంటామని గ్రామస్థులు తెలిపారు. ఏఈవో నరెందర్‌గౌడ్, రెవెన్యూ అధికారులు, యువకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు



పదవీ విరమణ పొందిన ప్రధాన ఉపాధ్యాయురాలు


నవతెలంగాణ-నార్సింగి

ప్రాథమిక పాఠశాల ఎల్ఎఫ్ఎల్ ప్రధాన ఉపాధ్యాయురాలు అడ్ల శారదా దేవి పదవీ విరమణ చేశారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నార్సింగి కాంప్లెక్స్ ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు పూర్ణ చందర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ శారదా దేవి జీవితం ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు ఆదర్శమన్నారు. నిస్వార్థమైన ఉద్యోగ జీవితాన్ని గడిపిన శారద నేడు ఉద్యోగ విరమణ పొందారని, శేష జీవితం ఆరోగ్యంగా సంతోషంగా ఉండాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయులు, వివిధ సంఘాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యాయులు శారదా దేవిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు పద్మశ్రీ, అనిత, లావణ్య, కవిత, తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ నాయకులు అసత్య ఆరోపణలు మానుకోవాలి

- కాంగ్రెస్ మండల అధ్యక్షులు మల్లేశం గౌడ్



నవతెలంగాణ-కొల్చారం

బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీపై చేస్తున్న అసత్య ఆరోపణలు మానుకోవాలని కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగుల గారి మల్లేశం గౌడ్ అన్నారు. శుక్రవారం రంగంపేట సహకార సంఘం ఆవరణలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పడిన సంవత్సరం కాలంలోనే సంక్షేమ పథకాల అమలుపై బీఆర్ఎస్ నాయకులు అత్యుత్సాహాన్ని ప్రదర్శిస్తూ ప్రభుత్వాన్ని విమర్శించడం సరైనది కాదన్నారు. 420 పదం కాంగ్రెస్ పార్టీకి చెల్లదని గత బీఆర్ఎస్ ప్రభుత్వం 420 హామీలు ఇవ్వడంతోనే బీఆర్ఎస్ నాయకులను ప్రజలు ఫామ్ హౌస్‌లో కూర్చోబెట్టారని విమర్శించారు. రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికి అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకునే ప్రసక్తి లేదన్నారు. మీలా భూ దందాలు, రైస్ మిల్ దందాలు చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నది మీరని ఆరోపించారు. గతంలో 10 ఏళ్ల పరిపాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఏ ఒక్క గ్రామంలో నైనా లబ్దిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇచ్చిన దాఖలాలు లేవని, బీఆర్ఎస్ నాయకులు ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలను తూచా తప్పకుండా అమలు చేస్తున్నామని తెలిపారు. పార్టీలకు అతీతంగా రైతు రుణమాఫీ పథకంలో బీఆర్ఎస్ నాయకులకు సైతం లబ్ధి చేకూరిందని తెలిపారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ నాయకులు అవాస్తవాలు మానుకుని అభివృద్ధికి సహకరించాలని కోరారు. లేనిపక్షంలో బీఆర్ఎస్ నాయకుల బండారాలు బయటికి తీస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రంగంపేట గ్రామ అధ్యక్షులు కొండ కృష్ణ, మాజీ సర్పంచ్ బండి రమేష్, మాజీ వైస్ ఎంపీపీ మల్లారెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి మరెల్లి అనిల్, గోవర్ధన్, మధుసూదన్ రెడ్డి, రవీందర్ గౌడ్, ఆగం గౌడ్, భూమయ్య, శివకుమార్, కార్తీక్ రాజు తదితరులు ఉన్నారు.

వల్లంపట్ల గ్రామాన్ని ఎంపీటీసీ సెగ్మెంట్‌గా చేయాలి

- ఎంపీడీవోకు వినతి పత్రం అందజేసిన నాయకులు



నవతెలంగాణ-మద్దూరు

మండలంలోని వల్లంపట్ల గ్రామాన్ని ఎంపీటీసీ సెగ్మెంట్‌గా చేయాలని ఆ గ్రామానికి చెందిన అన్ని రాజకీయ పార్టీల నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు శుక్రవారం ఎంపీడీవో రామ్మోహన్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కమిటీ సభ్యులు ఆలేటి యాదగిరి మాట్లాడుతూ..ఇప్పటివరకు వల్లంపట్ల, గాగిల్లాపూర్, నర్సాయపల్లి గ్రామాలు ఎంపీటీసీ సెగ్మెంట్‌గా ఉన్నాయని దీంతో మూడు గ్రామాల మధ్య దూరం ఎక్కువగా ఉండడం వల్ల పరిపాలన సౌలభ్యంగా లేకపోవడం వల్ల ఇబ్బందులు ఏర్పడ్డాయని తెలిపారు. ఓటర్లు జనాభా ఎక్కువ ఉన్న వల్లంపట్లను ఎంపీటీసీ సెగ్మెంట్‌గా చేయడానికి అన్ని రకాల అర్హతలు ఉన్నాయని వల్లంపట్లను సపరేట్ సెగ్మెంట్‌గా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్‌లు కర్నె మనోహర్, వేల్పుల రమేష్, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు వేల్పుల ప్రకాశం, కాంగ్రెస్ నాయకులు గుండెగోని మల్లేశం, ఆల్ల పరిపూర్ణం, మీస మల్లయ్య, బీఆర్ఎస్ నాయకులు మీస అయిలయ్య, బీజేవైఎం నాయకులు నారదాసు సందీప్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీలను తొలగించిన అధికారులు..



నవతెలంగాణ-బెజ్జంకి

ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో ఉండగా మండలంలో అయా రాజకీయ పార్టీలు విచ్చలవిడిగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించడంలో అధికారుల అలసత్వం..! అనే శీర్షికతో నవతెలంగాణ దిన పత్రిక శుక్రవారం వార్తను ప్రచురించింది. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రనీత్ రెడ్డి నవతెలంగాణ వార్తకు స్పందించారు. పంచాయతీ సిబ్బందితో ఆ ఫ్లెక్సీలను తొలగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ఎన్నికల ప్రవర్తన నియమావళి పకడ్బందీగా అమల్లో ఉందని అనుమతుల్లేకుండా ఎవరూ ఫ్లెక్సీలను ఏర్పాటుచేయవద్దని హెచ్చరించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘించిస్తే చట్టపరమైన చర్యలు చేపడుతామని తెలిపారు.

నవతెలంగాణ స్పందన

కొండపాకలో సివిల్ రైట్స్ డే



నవతెలంగాణ-కొండపాక

మండల కేంద్రమైన కొండపాకలో శుక్రవారం అధికారులు సివిల్ రైట్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా హక్కులు విధుల గురించి అధికారులు ప్రజలకు తెలిపారు. అందరికీ సమాన హక్కులే ఉంటాయని ఎలాంటి భేద భావం లేకుండా కలిసిమెలిసి ప్రశాంత వాతావరణంలో జీవనం సాగించాలని సూచించారు. సమాజంలో అందరూ సమానమేనని ఎవరిని కూడా చిన్న చూపు చూడడం తగదన్నారు. కుకునూరుపల్లి పోలీస్ స్టేషన్ అధికారి రమణమూర్తి, తహసీల్దార్ కార్యాలయ రెవెన్యూ ఇన్స్ పెక్టర్ బాలకృష్ణ మూర్తి, పంచాయతీ కార్యదర్శి నరేష్, నాయకులు అంబటి బాలచందర్ గౌడ్, సురేందర్, మల్లేశం, బర్రె శ్రీనివాస్ గ్రామస్తులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో యువరైతు ఆత్మహత్య



నవతెలంగాణ-మద్దూరు

నరాల సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఓ యువ రైతు చెట్టుకు ఉరివేసుకొని మృతి చెందిన సంఘటన మండలంలోని రేబర్తి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. మద్దూరు ఎస్ఐ షేక్ మహబూబ్, తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన నాలుసాని రాజిరెడ్డి, (45) నరాల వ్యాధితో గత కొద్దిరోజులుగా బాధపడుతూ ఎన్ని ఆస్పత్రులు తిరిగిన వ్యాధి నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెందిన అతను. తన వ్యవసాయ భావి వద్ద చెట్టుకు ఉరివేసుకొని మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి భార్య లత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి ఇద్దరు కుమారులున్నారు.

నరసింహాలయంలో జిల్లా న్యాయమూర్తి పూజలు

- పూర్ణకుంభంతో స్వాగతం పలికిన ఆలయ సిబ్బంది
- ఘనంగా సన్మానించిన ఆలయ కమిటీ సభ్యులు



నవతెలంగాణ-బెజ్జంకి

మండల కేంద్రంలోని లక్ష్మి నరసింహ స్వామి ఆలయాన్ని జిల్లా న్యాయమూర్తి సాయి రమాదేవి శుక్రవారం సందర్శించారు. ఆమెకు ఆలయ సిబ్బంది, ఆలయ అభివృద్ధి పాలక వర్గం సభ్యులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ఆమె కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శనం గావించారు. న్యాయమూర్తిని ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మెన్ జెల్లా ప్రభాకర్ శాలువ కప్పి ఘనంగా సన్మానించారు.

నవ వధువుకు పుస్తెమట్టెలు అందజేత



నవతెలంగాణ-మర్కుక్

మండలంలోని పాములపర్తి గ్రామానికి చెందిన నీల కవిత-ఐలయ్యల కూతురు రాధిక వివాహానికి పుస్తెమట్టెలను బీఆర్ఎస్ బీసీ సెల్ మర్కుక్ మండలాధ్యక్షులు మేకల కనకయ్య ముదిరాజ్ శుక్రవారం అందజేశారు. ఆయన వెంట మర్కుక్ మాజీ సర్పంచ్ అచ్చంగారి భాస్కర్, కొట్టాల మహేష్, రామచంద్రం, తదితరులున్నారు.

కుష్టి వ్యాధి నివారణపై ప్రతిజ్ఞ



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండలం సిద్దన్నపేట గ్రామంలో కుష్టి వ్యాధి నివారణ, జాగ్రత్తలపై ప్రతిజ్ఞ చేశారు. డాక్టరు అంజలి, అర్చనలు మాట్లాడు తూ..కుష్టి వ్యాధి వచ్చిన వాళ్లను జాగ్రత్తగా చూసుకోవాలని చెప్పారు. ప్రభుత్వ సంబంధించిన వైద్యులను సంప్రదించి వాళ్ళ సూచనలను పాటించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో నంగునూరు మండలంలోని డాక్టర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, గ్రామస్తులు డాకూరి భాస్కర్ రెడ్డి, పుల్లగూర్ల మధు జనార్దన్ రెడ్డి, పంగ శేఖర్, మహేంద్రా చారి తదితరులు పాల్గొన్నారు.

ఐలమ్మ విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్‌లో పాండవుల చెరువు మడేలయ్య గుడి బైపాస్ రోడ్డు నందు తెలంగాణ వీరనా రి బడుగు బలహీ న వర్గాల ఆశాజ్యోతి, యువతకు స్ఫూర్తిదాత "చాకలి ఐలమ్మ నిలువెత్తు విగ్రహ ప్రతిష్ఠాపన భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఉపాధ్యక్షులు రాంగారి శ్రీధర్ అధ్యక్షత వహిస్తూ విగ్రహ ఏర్పాటు సహకరిస్తున్న అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. విగ్రహ ఏర్పాటులో ఐక్యంగా ఉంటూ మునుముందు మంచి కార్యక్రమాలు చేయాలని సూచించారు. ఈ భూమి పూజ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మెన్ ఎన్‌సీ రాజమౌళి, మాజీ వైస్ చైర్మెన్ జక్కియోద్దీన్, మాజీ వార్డ్ కౌన్సిలర్ శ్రీధర్, చందు నర్సింగరావు, గజ్వేల్ నియోజకవర్గ రజక అధ్యక్షులు రాచమల్ల ఎల్లేష్, నియోజకవర్గ నాయకులు నరసింహులు, రజక నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన ముర్షిద్ గడ్డ దర్గా ఉర్సు ఉత్సవాలు



నవతెలంగాణ-సిద్దిపేట

పట్టణంలోని ముర్షిద్ గడ్డ దర్గా ఉర్సు ఉత్సవాలు శుక్రవారంతో ముగిసాయి. పీఠాధిపతి ఖాజా మహమ్మద్ హకీమ్ షరీఫ్ చిష్తి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కవ్వాలి పాటలు ఆకట్టుకున్నాయి. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ పల్లి పీఠాధిపతి సయ్యద్ ముక్తార్ హుస్సేని, హాఫెజ్ ఖైరాబాద్ పీఠాధిపతి ఫుర్ఖాన్ హష్మీ, మంతూర్ పీఠాధిపతి ఏజాజ్ పటేల్, సూరారం పీఠాధిపతి యునుస్ పటేల్,పెద్దాపూర్ పీఠాధిపతి మహమూద్, ఖాజా మహమ్మద్ సాబేర్ షరీఫ్, ప్రభు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య భవనంలో ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-సిద్దిపేట

వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా ఆర్య వైశ్య భవనంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆర్యవైశ్య భవన అధ్యక్షులు ఐత బాల రాజేశం పథకావిష్కరణ చేశారు. అనంతరం అమ్మవారికి అభిషేకం, వనిత క్లబ్, ఆర్యవైశ్య మహిళలు వాసవి మాత పారాయణం, కుంకుమార్చన నిర్వహించారు. వెయ్యి మందికి అన్న ప్రసాదం కొమరవెల్లి అనిత బాలకిషన్ సహకారంతో అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య భవన సభ్యులు పోశెట్టి శ్రీకాంత్, గంప కృష్ణమూర్తి, చింత రాజేంద్రప్రసాద్, అశోక్, రవి, రాజేశం, దామోదర్, గంప శ్రీనివాస్, రత్నాకర్, తదితరులు పాల్గొన్నారు.

ముందుకు జరగని ఎల్ఆర్ఎస్



నవతెలంగాణ-గజ్వేల్


జిల్లాలో మున్సిపాలిటీల్లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన ఇందుకోసం నియమించిన కమిటీలు ఇవ్వడంలో జాప్యం కారణంగా పరిశీలన ప్రక్రియ ఆలస్యం అవుతుందని విమర్శలున్నాయి. సంక్రాంతి పండుగ పోవడంతో మంచి ముహూర్తాలు ఉన్నందున ఇండ్ల నిర్మాణం ప్రారంభించాలని ఇంటి యజమానులు భావిస్తున్న తరుణంలో అనుమతులు రావడం లేదు. అనుమతులు లేని వెంచర్‌లో ఇంటి నిర్మాణం చేస్తూ మళ్ళీ మొదటికి వస్తుందని ఇంటి యజమానులు భావిస్తున్నారు. ప్రజల విజ్ఞప్తులను అధికారులు స్వాగతించాలని భావిస్తున్నారు. గత ప్రభుత్వం ఎల్ఆర్ఎస్‌కు అనుమతి ఇచ్చింది. ప్రక్రియ కొనసాగుతు న్నతరునంలో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సైతం ఏడాది దాటుతున్న ఎల్ఆర్ఎస్ కు అనుమతి ఇవ్వలేక పోతుంది. దరఖాస్తులను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం గత అక్టోబర్ నెలలో కమిటీలు వేసింది. జిల్లాలో 549 మందితో 29 కమిటీలు ఏర్పాటు చేశారు. అదేవిధంగా నవంబర్ 2020 వరకు జిల్లా వ్యాప్తంగా సుమారు 80 వేల దరఖాస్తులు వచ్చాయి. వీటి పరిశీలనకు ప్రత్యేక యాప్‌ను తయారు చేశారు. నీటిపారుదల, రెవిన్యూ, టౌన్ ప్లానింగ్ మూడు లాగిన్లు ఏర్పాటు చేసి పరిశీలన చేస్తున్నారు. గతంలో ఇచ్చిన దరఖాస్తు క్షేత్రస్థాయిలో ఉన్న ఇంటి యజమానికి సంబంధం లేకపోవడం వంటి విషయాలు బయట పడుతున్నాయి. వాటికి సంబంధించిన ఫోన్ నెంబర్లు కూడా సరిగా లేకపోవడంతో హద్దులు గుర్తించడం కొంత ఇబ్బందిగా ఉందని అధికారులు అంటున్నారు.

జిల్లాలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు

సిద్దిపేట మున్సిపల్ పరిధిలో 32,354 దరఖాస్తులు రాగా 440 ఇప్పటివరకు పరిశీలన చేశారు. 288 తిరస్కారనకు గురయ్యాయి. 31, 626 పెండింగ్‌లో ఉన్నాయి. గజ్వేల్ మున్సిపాలిటీలో 11,548 దరఖాస్తులు పెట్టుకోగా 2,918 దరఖాస్తులను పరిశీలన చేశారు. 8, 630 పెండింగ్‌లో ఉన్నాయి. దుబ్బాక 1,884 దరఖాస్తులు రాగా 488 పరిశీలన చెయ్యగా 125 తిరస్కరణ జరిగింది. పెండింగ్లో 3707 వరకు ఉన్నాయి. హుస్నాబాద్‌లో 6,054 దరఖాస్తులు రాగా 3813 పరిశీలన చెయ్యగా 106 తిరస్కరణ, 3707 వరకు పెండింగ్లో ఉన్నాయి. చేర్యాలలో 6,017 దరఖాస్తులు రాగా 2443 పరిశీలన చేశారు, 3574 వరకు పెండింగ్‌లో ఉన్నాయి. సుడ పరిధిలో 21,340 దరఖాస్తులు రాగా 15 వేల వరకు పరిశీలన చేశారు, 340 వరకు పెండింగ్లో ఉన్నాయి. సిద్దిపేట జిల్లాలో ఇప్పటివరకు సుమారు 40శాతం వరకే ప్రక్రియ పూర్తయినట్లు తెలుస్తుంది.

రాజమౌళి సేవలు ప్రశంసనీయం

- బీఆర్ఎస్ నేత కేటీఆర్




నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మెన్‌గా నేతి చిన్న రాజమౌళి ప్రజల మన్నలు పొందినట్లు మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. శుక్రవారం ఉమ్మడి మెదక్ జిల్లాలో మున్సిపల్ చైర్మెన్ పదవి కాలం ముగిసిన చైర్మెన్‌లకు పార్టీ పరంగా ఏర్పాటు చేసిన సన్మాన సభలో గజ్వేల్ మున్సిపల్ చైర్మెన్‌గా పనిచేసిన రాజమౌళి పాల్గొనగా ఆయనకు ఘనంగా సన్మానం చేశారు. కేసీఆర్ ప్రాతినిధ్య వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గంలోని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్‌లో ఎలాంటి మనస్పర్ధాలు లేకుండా 5 ఏండ్లు ఏకతాటిగా ఉండి అభివృద్ధి సాధించినట్లు తెలిపారు. రానున్న అన్ని ఎన్నికల్లో గజ్వేల్ నియోజకవర్గంలో పార్టీ విజయం సాధించాలన్నారు. నియోజకవర్గంలో రెండు మున్సిపాలిటీలు, 9 జెడ్పీటీసీలు, ఎంపీపీలు బీఆర్ఎస్ ఖాతలపడాలన్నారు. ఇందుకు కార్యకర్తలు నాయకులు మాజీ ప్రజాప్రతినిధులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఫ్డీసీమాజీ చైర్మెన్ ప్రతాప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను విమర్శించే హక్కు జేఏసీకి, బీఆర్ఎస్‌కి లేదు

నవతెలంగాణ-చేర్యాల: చేర్యాల ప్రాంతాన్ని మోసం చేసిన బీఆర్ఎస్, జేఏసీకి కాంగ్రెస్ పార్టీ నాయకులను విమర్శించే నైతిక హక్కు లేదని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పుర్మ ఆగం రెడ్డి, మండల అధ్యక్షులు కొమ్ము రవి, పట్టణ అధ్యక్షుడు దాసరి శ్రీకాంత్ అన్నారు. మండల కేంద్రంలోని కొమ్మూరి నివాసంలో శుక్రవారం ఏర్పడి చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న రెండు పర్యాయాలు బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచిన ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఉన్న పల్లా రాజేశ్వర్ రెడ్డి ఈ ప్రాంత భౌగోళిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితులను ఏనాడు పట్టించుకోలేదని విమర్శించారు. ఆనాడు ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అన్ని రాజకీయ పార్టీలను ఏకం చేసి జేఏసీగా ఏర్పడి దీక్షలు, ధర్నాలు,రాస్తారోకోలు, ఆందోళన కార్యక్రమాలు నిర్వహించి నాడు ప్రతిపక్షంలో నేడు అధికారపక్షంలో ఉండి కూడా కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి నాయకత్వంలో మంత్రులను, ప్రభుత్వ అధికారులను కలు స్తూ చేర్యాల రెవెన్యూ డివిజన్ కోసం లాబీయింగ్ చేస్తూ చేర్యాల ప్రాంత ముద్దుబిడ్డగా ఈ ప్రాంత అస్తిత్వం కోసం అహర్నిశలు కృషి చేస్తున్నాడని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల జోలికి వస్తే ప్రజలే తగిన రీతిలో బుద్ధి చెపు తారని హెచ్చరించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆడెపు చంద్రయ్య,పాల లక్ష్మి నారాయణ, మంచాల చిరంజీవులు, చెవిటి లింగం, ముస్త్యాల యాదగిరి,వెలుగల దుర్గయ్య పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా వై.అశోక్ కుమార్‌ను గెలిపించండి



నవతెలంగాణ-సిద్దిపేట

కరీంనగర్ నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ టీపీటీఎఫ్ అభ్యర్థిగా వై. అశోక్ కుమార్‌ను టీఎస్ యూటీఎఫ్ బలపరుస్తుందని, ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాలు కలిసి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో ఎమ్మెల్సీగా గెలిపించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు జి.తిరుపతిరెడ్డి కోరారు. శుక్రవారం తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ సిద్దిపేట జిల్లా కమిటీ అత్యవసర సమావేశం ఉపాధ్యాయ భవన్‌లో జిల్లా అధ్యక్షులు సిహెచ్. విజయేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి డి.రాజయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయ, ఉద్యోగులకు రావాల్సిన 5 డీఏలను వెంటనే విడుదల చేయాలని, 23 జులై నుంచి వేతన సవరణ సంఘాన్ని అమలు చేయాలని, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులని వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, ఓపీఎస్‌ను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్, రాష్ట్ర కౌన్సిలర్లు జమీర్ మొహియుద్దీన్, తిరుపతి, జానకి రాములు, జిల్లా ఉపాధ్యక్షులు ఏ నరసింహారెడ్డి, శివాజీ, పాపిరెడ్డి, మల్లేశం, ఎండి అజీజ్, ప్రభాకర్, జిల్లా కార్యదర్శి ఏ. సత్యనారాయణ, సత్య కృష్ణ, మంజుల, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల సమస్యలను పరిష్కరించాలి

- ఎంపీడీఓకు వినతి పత్రం



నవతెలంగాణ-నంగునూరు

పంచాయతీ కార్యదర్శుల సమస్యలను పరిష్కరించాలని, పని భారం తగ్గించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు శుక్రవారం నంగునూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ లక్ష్మప్పకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా నాలుగు పథకములకు సంబంధించి ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో అర్హులు, అనర్హులు నిర్ణయించే ప్రక్రియలో కేవలం పంచాయతీ కార్యదర్శులను మాత్రమే బాధ్యులను చేయడం వలన క్షేత్రస్థాయిలో మేము అనేక ఇబ్బందులకు ఎదుర్కొంటున్నామన్నారు. అందువల్ల ఈ ప్రక్రియ నుంచి పంచాయతీ కార్యదర్శులను మినహాయింపు ఇవ్వాలని కోరారు. అదేవిధంగా రేషన్ కార్డుల అప్లికేషన్లు వాటికి సంబంధించిన రెవెన్యూశాఖ అప్పగించి వారితో మాత్రమే ఫీల్డ్ వెరిఫికేషన్ చేయించాలని పేర్కొన్నారు. అలాగే గత సంవత్సర కాలంగా స్పెషల్ ఆఫీసర్ పీరియడ్‌లో పంచాయతీ కార్యదర్శులు ఒక గ్రామానికి దాదాపు రూ.50 వేల నుంచి రూ. 2లక్షల వరకు తమ సొంత డబ్బులు ఖర్చు పెట్టడం జరిగిందని తెలిపారు. ఈ సమస్యలను పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి బిల్లులు వచ్చే విధంగా చూడాలని తెలియజేశారు. మిషన్ భగీరథ స్పెషల్ డ్రైవ్‌లో ఏలాంటి సామాగ్రిన కనీసం బ్లీచింగ్ పౌడర్ కొనాలన్నా ఇబ్బందిగా ఉందన్నారు. డబ్బులు విషయంలో పంచాయతీ కార్యదర్శులను మినహాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు వి.చంద్రకళ, గౌసోద్దీన్, రవీందర్, సురేశ్ రెడ్డి,దేవేందర్, అర్షద్, సౌమ్య కృష్ణవేణి, సృజన, లలిత, పద్మ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటా..

- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి



నవతెలంగాణ-మద్దూరు

మద్దూరు మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త మహమ్మద్ మోబిన్ హుస్సేన్ గుండెపోటుతో మృతి చెందడంతో మృతుని కుటుంబాన్ని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండెపోటుతో మృతి చెందిన మహమ్మద్ మోబిన్ హుస్సేన్, కుటుంబానికి అండగా ఉంటానని తెలిపారు. మొబిన్ కుమారుడు ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతుండడంతో మిగతా ఇంజనీరింగ్ పూర్తి అయ్యేవరకు ఖర్చు భరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మేక సంతోష్ కుమార్, మాజీ ఎంపీటీసీ బూర్గు నరసింహులు, బీఆర్ఎస్ నాయకులు మనోహర్, ఎండీ సిద్ధిక్, షకీల్ అహ్మద్, ఫయాజుద్దీన్, తదితరులు ఉన్నారు.

అనాజిపూర్ గ్రామ రక్షణకే సీసీ కెమెరాల ఏర్పాటు

- బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి నీల స్వామి




నవతెలంగాణ-దౌల్తాబాద్

సీసీ కెమెరాల ద్వారా శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ పకడ్బందీగా చేయవచ్చనే ఉద్దేశంతో అనాజీపూర్ గ్రామ రక్షణ కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి నీల స్వామి అన్నారు. శుక్రవారం రాయపోల్ మండలం అనాజీ పూర్ గ్రామంలో సొంత నిధులతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రధాన కూడళ్లలో సొంత నిధులతో 4 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సీసీ కెమెరా లు ఉన్న గ్రామాల్లో ఎలాంటి కేసులు నమోదు కావడం లేదని, ఏ చిన్న సంఘటన జరిగినా సీసీ కెమెరాల ద్వారా వెంటనే తెలుసుకోవచ్చని సీసీ కెమెరాలు మరింత భద్రత, సెన్సాఫ్ సెక్యూరిటీ కల్పిస్తాయని తెలిపినారు. రాత్రింబవళ్లు 24 గంటలు ప్రజలకు రక్షణగా నిలుస్తాయని తెలిపినా రు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు రాచకొండ వెంకటే ష్,అమ్మని కిష్టయ్య జోడు కరుణాకర్, గాండ్ల కనకయ్య, అమ్మని మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మి నరసింహస్వామి కల్యాణ మహోత్సవంలో వంగ

నవతెలంగాణ-సిద్దిపేటరూరల్ :ప్రజ లందరికీ లక్ష్మీనరసింహస్వామి ఆశీస్సులు ఉండాలని వంగ రాజేశ్వర్ రెడ్డి అన్నారు. శుక్రవారం సిద్దిపేటరూరల్ మండలంలోని పుల్లూరు గ్రామంలో అంగరంగ వైభవంగా జరుగుతున్న పుల్లూరు బండ జాతర స్వయంభూ లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవంలో ఆయన పాల్గొని స్వామి వారిని దర్శించుకొని పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ అర్చకులు, ఆలయ కమిటీ చైర్మెన్, గ్రామ ప్రజలు శాస్త్రోక్తంగా స్వాగతించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామివారి కృపతో సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో పంట పొలాలు పాడి పశువులు చల్లగా చూడాలన్నారు. అనంతరం తోర్నాల గ్రామంలో పెద్దమ్మ తల్లి కళ్యాణ మహోత్సవంలో పెద్దమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు రంగాచారి, ఆలయ కమిటీ చైర్మెన్ పుల్లూరు కనకయ్య, మాజీ సర్పంచ్ పల్లె నరేష్ గౌడ్, మాజీ ఎంపీటీసీ లత తదితరులు పాల్గొన్నారు




ఘనంగా గద్దర్ 77వ జయంతి వేడుకలు











నవతెలంగాణ-సిద్దిపేట

గద్దర్ 77వ జయంతి సందర్భంగా అంబేద్కర్ విగ్రహం వద్ద గద్దర్ చిత్రపటానికి వివిధ విద్యార్థి, ప్రజాసంఘాలు, వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గద్దర్ దేశవ్యాప్తంగా అనేక సామాజిక, సాంస్కృతిక, రాజకీయ విప్లవ ఉద్యమాల్లో క్రియాశీలకంగా పనిచేశాడని కొనియాడారు. ఆయన తుది శ్వాస వరకు పేద ప్రజల పక్షాన నిలబడ్డాడని గుర్తు చేశారు. ఇటీవల గద్దర్ పై కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో గద్దర్ విగ్రహాన్ని అతి త్వరలో నెలకొల్పనున్నట్ల తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం), సీపీఐ, సీపీఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ, ప్రజా ఫ్రంట్, మాల మహానాడు, డీబీఎఫ్, పీడీఎస్‌యూ, యుఎస్ఎఫ్ఐ, టీడీఎస్ఎఫ్ సామాజిక దళిత సంఘాల నాయకులు గోపాల స్వామి, మంద పవన్, సత్తయ్య ఎస్.వి శ్రీకాంత్ , పోచబోయిన శ్రీహరి యాదవ్, పి.శంకర్ ,భీమసేన ,గ్యాదరి జగన్, పడిగే ప్రశాంత్, పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

చేర్యాల: ప్రజా గాయకుడు గద్దర్ 77వ జయంతి సందర్భంగా శుక్రవారం జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో చేర్యాల పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద గద్దర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుట్టి సత్యనారాయణ మాట్లాడుతూ. .గద్దర్ ప్రజా కవి, తెలంగాణ ఉద్యమకారుడు, ఒక బుద్ధిష్ట తన జీవితం మొత్తం ఆటపాట ఒక కులానికి, ఒక మతానికి పరిమితమైనది కాదన్నారు. భారతదేశంలోని అన్ని వర్గాల అన్ని రంగాల ప్రజల కోసం పాడడని, గద్దర్ పాటల్లో నిరంతరం ప్రజల ఆవేదన, బాధలు, కష్టాలు గుర్తింపు చేస్తూ హక్కులు, సమానత్వం కోసం, శ్రామిక వర్గ రాజ్యాధికారం సంగిటితంగ పోరాడాలని చెప్పారని అన్నారు. ఈ కార్యక్రమంలో చేర్యాల డివిజన్ అధ్యక్షులు చింతల విజయ్ కుమా ర్, పట్టణ అధ్యక్షులు పుట్ట రాజు, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి చంద శ్రీకాంత్, నియోజకవర్గ యూత్ అధ్యక్షులు పాకనాటి భాస్కర్, పట్టణ యూత్ అధ్యక్షులు బుట్టి సాయి, మండల నాయకులు,పాల్గొన్నారు.

గజ్వేల్: ప్రజాయుద్ధనౌక గద్దర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మల్లయోధుల ఐక్య కార్యాచరణ కమిటీ (మాల) నాయకులు ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచానికి పరిచయమున్న మహా గాయకుడు గద్దర్. తుపాకీ తూటాలే గద్దర్ వెన్నెముక భాగంలో దాక్కున్న తూటాను సైతం లెక్క చేయకుండా ప్రజల కోసం పనిచేసిన మహా నాయకుడు గద్దర్ కే సాధ్యమైందన్నారు. కార్మికులకు కర్షకులకు పీడిత పేద ప్రజల కోసం గొంతుకై నిలిచినటువంటి విప్లవ వీరుడే పరిచయం లేని ప్రపంచంలో లెజెండ్ ఆయనే గద్దర్, ఈ కార్యక్రమంలో చిప్పల యాదగిరి, తుమ్మ శ్రీనివాస్, బండారు దేవేందర్, భైరం శివకుమార్, కొడకండ్ల నర్సింలు, శ్రీనివాస్ ఆరోగ్యులు శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.



గజ్వేల్:ప్రజావాగ్గేయకారుడిగా పేరు గాంచిన తెలంగాణ ఉద్యమ చైతన్య ప్రతీక గద్దర్ జయంతిని పురస్కరించుకొని ప్రభుత్వ డిగ్రీ కళాశాల గజ్వేల్ తెలుగు విభాగం వారు కార్యక్రమం ఏర్పాటు చేశారు. పాల్గొన్న కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ గణపతి రావు మాట్లాడుతూ శ్రామిక జన జీవనం నుండి వచ్చిన విఠలరావు అనేక ప్రజా ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించి గద్దర్‌గా పేరుగాంచారు. ఆట పాట మాట కలగలిసి సాగే వారి ప్రసంగం శ్రోతలను వీక్షకులను మంత్రముగ్ధులను చేసేది అటువంటి గొప్ప ఉద్యమకారురు గద్దర్ ఈ ప్రాంతానికి చెందిన వారు కావడం మనకు అందరికీ గర్వకారణం అని తెలియజేశారు. ఐక్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ వెంకటేష్, కోఆర్డినేటర్ డాక్టర్ మచ్చ భవాని, మిగతా అధ్యాపక బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

గజ్వేల్: గద్దర్ మూడు అక్షరాల పదమే కాదు భూమి, భుక్తి, విముక్తి పోరాటాలను ముందుండి నడిపిన ధీరత్వం. అసమానతలను రూపుమాపెందుకు తన గొంతుతో ప్రజలను చైతన్యం చేసిన జంగ్ సైరన్ అని గజ్వేల్‌లో గద్దర్ 77వ జయంతోత్సం సందర్భంగా డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన కలం, గళంతో గద్దర్ తెలంగాణ ఉద్యమానికి ఊపిరులూదారని, సమాజంలో అసమానాతలు, వివక్షలకు వ్యతిరేకంగా ఎలుగెత్తిన ప్రజలగొంతుక అని స్మరించుకున్నారు. తెలంగాణ ఉద్యమంలో యావత్తు జాతిని తన కళలతో ఎకంచేసి ఉద్యమం వైపు నడిపిన దిశాలి గద్దర్,పీడిత కులాల శ్రమను తన పాటలతో అప్పటి కప్పుడు అల్లి వారి జీవితాలలో పాటను బాగం చేసిన యోదుడు గద్దరన్నారు. ఈ కార్యక్రమంలో డీబీఎఫ్ మండల అధ్యక్షులు దార ఊశి చంద్రం, కనకప్రసాద్ పాల్గొన్నారు.

రాయపోల్: బడుగు బలహీన వర్గాల ఆత్మ బంధువు, పీడిత వర్గాల గొంతుక తన జీవితం మొత్తం ప్రజా చైతన్యం కోసమే త్యాగం చేసిన ఉద్యమ శిఖరం ప్రజా యుద్ధ నౌక గద్దర్ జయంతి సందర్భంగా ఘన నివాళి అర్పించడం జరిగిందని ఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షురాలు మహమ్మద్ సుల్తాన ఉమర్ అన్నారు. శుక్రవారం గద్దర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలు, పీడిత ప్రజల విముక్తి కోసం రాడికల్ విద్యార్థి ఉద్యమం నుండి, సమైక్య రాష్ట్రంలో ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాటం వరకు ఉద్యమం చేస్తూ తన ఆటపాటలతో ప్రజలను చైతన్యం చేశారన్నారు. పోరాటం ద్వారానే తెలంగాణ సాధ్యమని చెప్పిన యోధుడని అన్నారు. తన జీవితమే ఉద్యమాలు పోరాటాలు చివరి శ్వాస వరకు కూడా ప్రజల కోసం ప్రజల చైతన్యం కోసమే పరితపిస్తూ పాటే ప్రాణంగా జీవించిన మహోన్నత వ్యక్తి గద్దర్ అన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో రేకుల ఇల్లు దగ్ధం

-రూ.20వేల తక్షణ ఆర్థిక సాయం అందించిన కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్

సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లిలో బాకీ బిక్షపతి లక్ష్మీకి చెందిన రేకుల ఇల్లు ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్‌తో పూర్తిగా దగ్ధమైపోయిందని, బాధితులకు అండగా ఉంటామని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి పూజల హరికృష్ణ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు అత్తు ఇమామ్‌లు అన్నారు. శుక్రవారం జరిగిన సంఘటన విషయాన్ని తెలుసుకొని వెంటనే కాంగ్రెస్ నాయకులు అక్కడికి చేరుకొని బాధిత కుటుంబాలను పరామర్శించి రూ.20వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా హరికృష్ణ, అత్తూ ఇమామ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పక్షాన బాధిత కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. అర్బన్ మండలం ఎమ్మార్వో దృష్టికి విషయాన్ని తీసుకువెళ్లామని ప్రభుత్వ పరంగా కూడా ఆదుకునేలా ఎమ్మార్వో చర్యలు తీసుకోవాలని అన్నారు. కుటుంబాన్ని ఆదుకోవడానికి దాతలు ముందుకు వచ్చి సాయం అందిస్తే బాగుంటుందని కోరారు. నిరుపేద కుటుంబం కాయ కష్టం మీద ఆధారపడ్డ కుటుంబం ఉన్న కాస్త ఇల్లు దగ్ధం కావడంతో రోడ్డున పడ్డట్టైందని విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు ఫయాజుద్దీన్, గయాజుద్దీన్, నజ్జు, కవిత, శంకర్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో మెరుగైన ఆరోగ్యం



నవతెలంగాణ-రాయపోల్

పరిసరాల పరిశుభ్రతతో ప్రజలు మెరుగైన ఆరోగ్యవంతంగా ఉంటారని అప్పాయిపల్లి మాజీ ఉప సర్పంచ్ కేశబోయిన ప్రభాకర్ అన్నారు. శుక్రవారం దౌల్తాబాద్ మండలం అప్పాయి పల్లి గ్రామంలో ఫ్రై డే-డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో అంగన్ వాడీ, ఆశ కార్యకర్తలు గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ పాత్రలో నిల్వ ఉంచిన నీటిని తొలగించారు. నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో దోమలు ఉంటాయి. వాటి వల్ల విషజ్వరాలు, వ్యాప్తి చెంది, ప్రజలందరూ అనారోగ్యానికి గురవుతారు. ప్రతి శుక్రవారం ప్రజలందరూ ఫ్రైడే- డ్రై డే పాటించాలన్నారు. శుక్రవారం నీటి నిల్వ చేసే పాత్రలను పూర్తిగా నీరు తొలగించి వాటిని ఆరబెట్టుకోని మళ్లి నింపుకోవాలన్నారు. దాని ద్వారా ఆ పాత్రలో ఉండే సూక్ష్మజీవులు, క్రీములు చనిపోతాయి. ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండడానికి దోహదపడు తుంది. ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్త సరిత తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య రాకుండా చూసుకోవాలి



నవతెలంగాణ-మద్దూరు

రానున్న వేసవి కాలంలో గ్రామాల్లో నీటి సమస్య లేకుండా చూసుకోవాలని ఇంట్రా డీఈఈ కృష్ణ కోరారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయం లో పంచాయతీ కార్యదర్శులతో నీటి సమస్యలపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వేసవికాలంలో గ్రామాల్లో ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా చూసుకోవాలని కోరారు. గ్రామాల్లో త్రాగునీటి కోసం ఏమేం సమస్యలు ఉన్నాయో పంచాయతీ కార్యదర్శులు గుర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామ్మోహన్, ఇంట్రా ఏఈ ప్రవళిక, గ్రిడ్ ఏఈ దినేష్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

అక్బర్ పేట-భూంపల్లికి ఎంఆర్‌వో, ఎంపీడీవోలు నియామకం



నవతెలంగాణ-మిరుదొడ్డి

అక్బరుపేట-భూంపల్లి మండల తహసీల్దాంగా మల్లికా ర్జున్ రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ..మండలంలోని రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, కులం, ఆదాయ, ధ్రువ పత్రాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరువ చేసి మండలాన్ని అభివృద్ధి బాటలోనడిపిస్తానన్నారు. అనంతరం రెవెన్యూ సిబ్బందితో సమావేశమ య్యారు. సిబ్బంది అందరూ తమ విధుల పట్ల బాధ్యతగా వ్యవహ రిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలను పరిష్కరించాలన్నారు.



నూతన ఎంపీడీవోగా జైపాల్ రెడ్డి.. దుబ్బాక నియో జకవర్గంలోని అక్బర్‌పేట-భూంపల్లి మండల నూతన ఎంపీడీవో గా జైపాల్ రెడ్డి నియామకం అయ్యారు. నూతనంగా మండలం ఏర్పడినప్పటికీ నేటి వరకు ఎంపీడీవోను గత ప్రభుత్వం నియమించలేదు. నూత న ఎంపీడీవోను నేడు నియమిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేయడంతో ఎంపీడీవో జైపాల్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు.నూతన ఎంపీడీవో జైపాల్ రెడ్డికి మిరుదొడ్డి ఎంపీడీవో గణేష్ రెడ్డి స్వాగతం పలికి బాధ్యతలు అప్పగించారు. ఈ కార్యక్రమం లో ఎంపీఓ జహీరుద్దీన్ ,కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు పలువురు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల పట్టణ కేంద్రంలో శుక్రవారం జరిగిన బీఆర్ఎస్ కార్యకర్త జమలాపురం రమేష్ కూతురు ఎంగేజ్మెంట్, మరో బీఆర్ఎస్ కార్యకర్త పోలబోయిన శంకర్ కూతురు అక్షిత వివాహానికి జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జమలా పురం రమేష్ కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేను శాలువా కప్పి ఘనంగా సన్మానిం చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు అనంతుల మల్లేశం, ముస్త్యాల నాగేశ్వరరావు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మెన్ పుర్మ వెంకట్ రెడ్డి, జేఏసీ చైర్మెన్ వకుళా భరణం నర్సయ్య పంతులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు పేదలందరికి అందజేస్తాం..



నవతెలంగాణ-గజ్వేల్ : సంక్షేమ పథకాలు పేదలందరికి అందజేస్తామని మున్సిపాల్ మాజీ కౌన్సిలర్ నక్క రేగొండ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి నాయకత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన ప్రతి పథకం ప్రజల వద్దకు వెళుతుందన్నారు. ఏడాది కాలంలో ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. అదేవిధంగా రైతులకు కావలసిన రైతు భరోసా సమాచారాన్ని ప్రభుత్వం ఆదుకుం టుందన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏకకాలంలో రూ.2 లక్షలపై రుణమాఫీ చేస్తే విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్‌లో రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ 20 స్థానాలు గెలుచుకుంటుందని ఆయన చెప్పారు.

యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులుగా సింగోజు



నవతెలంగాణ-సిద్దిపేట

తెలంగాణ బీసీ బహుజన సంక్షేమ సంఘం యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులుగా సిద్దిపేట పట్టణానికి చెందిన సింగోజు మురళీకృష్ణ ఆచార్యులను సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రతాపగిరి విజయ్ కుమార్ నియమించారు. శుక్రవారం నియామక పత్రం అందజేశారు. అనంతరం విజయ్ కుమార్ మాట్లాడుతూ..సమాజంలో జర్నలిస్టుగానే కాకుండా, వివిధ రంగాల్లో తమ కుల సంఘంలో, బీసీ కుల సంఘాల్లోని సభ్యులను కులాలకు అతీతంగా చైతన్య పరుస్తూ, వారి హక్కుల సాధన కొరకు తన వంతు కృషి చేస్తున్న సింగోజు మురళీకృష్ణ ఆచార్యులని గుర్తిస్తూ ఈ పదవిలో అవకాశం కల్పించామని తెలిపారు. అనంతరం సింగోజు మురళీకృష్ణ ఆచార్యులు మాట్లాడుతూ తనపై నమ్మకంతో యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులుగా నియమించిన విజయ్ కుమా ర్‌కు, వారి కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలియజేశారు. తన శాయశక్తుల కృషిచేసి, తన బీసీ సామాజిక వర్గానికి ప్రభుత్వపరంగా సంక్షేమ పథకాలు అందే విధంగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు వాసురి ఎల్లయ్య పాల్గొన్నారు.

మాజీ చైర్ పర్సన్‌కు సన్మానం



నవతెలంగాణ-దుబ్బాక

దుబ్బాక మున్సిపాలిటీ తాజా మాజీ చైర్ పర్సన్ గన్నె వనిత భూమిరెడ్డి దంపతులను శుక్రవారం హైదరాబాదలోని తెలంగాణ భవంలోమాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఐదేళ్లుగా మున్సిపల్ అభివృద్ధి, బీఆర్ఎస్‌కి చేసిన సేవలను గుర్తిస్తూ చైర్ పర్సన్ వనిత భూమిరెడ్డిని సన్మానించారు. మాజీ మంత్రి జగదీష్, మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

రాష్ట్రంలో స్పెషల్ ఆఫీసర్లతో పరిపాలన


-ఎఫ్డీసీ మాజీ చైర్మెన్ ప్రతాప్‌రెడ్డి



నవతెలంగాణ-గజ్వేల్ : స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహిస్తే కాంగ్రెస్ ఉనికి కోల్పోతుందని భయంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల నిర్వహించ కుండా రాష్ట్రంలో స్పెషల్ ఆఫీసర్లతో పరిపాలన చేస్తుందని ఎఫ్డీసీ మాజీ చైర్మెన్ వంటేరు ప్రతాప్ రెడ్డి అన్నారు. శుక్రవారం గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ..గత ఏడాది కాలంగా సర్పంచుల పదవి కాలం ముగిసిందని ఇటీవల మున్సిపల్ చైర్మెన్‌ల పదవీకాలం ముగియడంతో అన్ని స్థాయిలో స్పెషలాఫీసల పాలన రేవంత్ రెడ్డి కొనసాగిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రం మొత్తం స్పెషల్ ఆఫీసర్ల కంట్రోల్‌లోకి వెళ్లిపోయిందఅన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పరోక్షంగా ప్రెసిడెంట్ రూల్ నడుస్తుందన్నారు. ప్రస్తుతం అసమర్థ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిపాలన చేతకాక తెలంగాణ రాష్ట్రాన్ని అధికారుల చేతిలో పెట్టినట్లు అన్నారు.

అధికారుల నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమా..?

- పనిచేయడానికి ఒక రోజు ముందే నీళ్లు పట్టిన అధికారులు
- ఫీల్డ్ అసిస్టెంట్ పై అనుమానంతో గ్రామస్తుల ఫిర్యాదు
- అయినా పట్టించుకోని ఎంపీడీవో, ఏపీఓ, టీఏ ..!





నవతెలంగాణ- అక్కన్నపేట

అక్కన్నపేట మండలం గోవర్ధనగిరి గ్రామ ప్రమాద ఘటనలో అధికారుల నిర్లక్ష్యం చాలా స్పష్టంగా కనిపిస్తోంది. అనువు గాని ప్రదేశంలో పని పెట్టి కూలీలను భయభ్రాం తులకు గురిచేసి పనులు చేయించినట్టు సమాచారం. ఈ పని చేయడానికి ఒకరోజు ముందే పని ప్రదేశంలో నీళ్లను పట్టి, భూమి మెత్తబడేలా చేశాడని గ్రామస్తులు తెలియజేశారు. అంతేకాకుండా ఫీల్డ్ అసిస్టెంట్ ఒంటెద్దు పోకడతో వ్యవహరించేవాడని గ్రామస్తులు ఎంత చెప్పిన వినకుండా ఆయన చెప్పిందే వేదం అన్నట్టు ఉండేవారని గ్రామస్తులు అన్నారు. కొన్ని రోజుల క్రితం ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకి సంబంధించి అవకతవకలు జరిగాయని ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటస్వామిపై గ్రామస్తులంతా ఆరోపణ చేసి ఎంపీడీవోకు గత నాలుగు రోజుల క్రితం వినతిపత్రం అందించారు. అంతేకాకుండా పని జరిగిన రోజు ఫీల్డ్ అసిస్టెంట్ కనీసం లోకేషన్‌కు కూడా వెళ్లలేదని, 2023 నుంచి ఆయన పని విషయంలో ఎన్నో అవకతవకలు జరిపారని, అయినా ఎంపీడీవో పట్టించుకోకుండా, కనీసం ఎంక్వయిరీ కూడా చేయకుండా నిర్లక్ష్య ధోరణితో ఉన్నారని గ్రామస్తులు శుక్రవారం నవతెలంగాణతో విన్నవించారు. ఈ విధంగా అధికారులు పూర్తి నిర్లక్ష్యం చేయడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని, వారు అప్రమత్తంగా ఉంటే ఇలా జరిగి ఉండేది కాదని తెలియజేశారు. ఈ ప్రమాద ఘటనలో ఇద్దరు మరణించగా, మరో మహిళకు పూర్తిగా కాలును తొలగించారని గ్రామస్తులు తెలియజేశారు. ఇప్పటికైనా అధికారులు మత్తు నిద్ర వదిలి ఎంపీడీవో, ఏపీవో, టీఏ, ఫీల్డ్ అసిస్టెంట్లపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

జిల్లాలో డ్రగ్స్ నివారణకు శాఖలను సమన్వయం చేయాలి

- జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్



నవతెలంగాణ-సిద్దిపేటకలెక్టరేట్

జిల్లా కలెక్టరేట్‌లో రోడ్డు భద్రత కమిటీ, మత్తు పదార్థాల వినియోగ నివారణకు సంబంధించి అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) అబ్దుల్ హమీద్ శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ..జిల్లాలో డ్రగ్స్ సరఫరా, వినియోగాన్ని ఎట్టి పరిస్థితుల్లో అంతం చెయ్యాలని, ముఖ్యంగా ఎక్కడి నుంచి రవాణా అవుతుందో నిఘా పెట్టాలని సోషల్ మీడియాలో డ్రగ్స్ అవేర్నెస్ వీడియోలు, పోటోలలతో ప్రచారం చెయ్యాలని సూచించారు. విద్యాసంస్థల్లో డ్రగ్స్ వంటి మత్తుపదార్థాల వినియోగంపై అవగాహన సదస్సులను నిర్వహించాలన్నారు. విద్యాసంస్థల ముందు డ్రాపౌట్ విద్యార్థులు, ఇతరులు కాని డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని పోలిస్ అధికారులకు తెలిపారు. డ్రగ్స్ బారిన పడిన, పిల్లల ప్రవర్తనలో తేడా వచ్చిన వారి గుర్చి తెలియడానికి టోల్ ఫ్రి నం.1908 డయల్ చెయ్యాలని, జిల్లా అసుపత్రిలో డి-అడిక్షన్ సెంటర్‌కి పంపించాలని సూచించారు. ఆర్టీసి కండక్టర్ ,డ్రైవర్‌లకు సైతం డ్రగ్స్ రవాణా జరగకుండా బస్సులో గుర్తించే చర్యల గూర్చి పోలిస్ అధికారులు శిక్షణ ఇవ్వాలని, జిల్లాలో బయటి ప్రాంతాల నుంచి మత్తుపదార్థాల తరలింపు జరగకుండా తనిఖీలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రాజీవ్ రహదారుల వెంబడి అనధికారిక డివైడర్ కటింగ్స్‌లను ముసి వెయ్యాలని, అలాగే ఇతర గ్రామాల నుంచి రహదారి కలిసే ప్రాతంలో స్పీడ్ బ్రేకర్లు వెయ్యాలని హెచ్‌కేఆర్ అధికారులకు తెలిపారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఆర్టీసీ, పోలిస్ సిబ్బంది సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి డీఈ వెంకటేశ్వర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస మూర్తి, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పాగా వేయాలి



నవతెలంగాణ-గజ్వేల్

సిద్దిపేట జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధించాలని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి అన్నారు. శుక్రవారం వివిధ జిల్లాల చెందిన ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు సీఎం రేవంత్ రెడ్డి కలిసిన సందర్భంలో పై విధంగా అన్నట్లు ఆయన తెలిపారు. సిద్దిపేట జిల్లాలో జడ్పీటీసీలు, ఎంపీపీ, మున్సిపల్ చైర్మెన్ స్థానాలను గెలుచుకోవాలని పిలుపునిచ్చినట్లు చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని ఆయన సూచించినట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించి లోకల్ బాడీ ఎన్నికలు ఓట్లు అడగాలని సీఎం ను కలిసిన ఎమ్మెల్యేలు ప్రజాప్రతి నిధులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నట్లు తెలిపారు. నాలుగు సంవత్సర కాలంలో చేపట్టబోయే అభివృద్ధిపై చర్చించినట్లు ఆయన అన్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో 9 మండలాల జెడ్పీటీసీలు, ఎంపీపీలు, రెండు మున్సిపల్ చైర్మెన్ స్థానాలు కాంగ్రెస్ కైవాసం చేసుకోవాలని సూచించినట్లు చెప్పారు.

ప్రభుత్వ పథకాలు ప్రజలందరికీ వర్తిస్తాయి.

ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందరికీ ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటామని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి అన్నారు. శుక్రవారం గజ్వేల్ పట్టణంలో పటేల్ బజార్‌కి చెందిన లింగంగారి వెంకట్ గౌడ్‌కు సీఎం సహాయ నిధినుండి రూ.60వేల చెక్కును అందించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గజ్వేల్ నియోజకవర్గం లో సీఎం సహాయ నిధి కింద పేదలను ఆదుకునేందుకు తక్షణ చర్యలు తీసుకుంటామని చెప్పారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా పేదల ఆరోగ్యానికి ఈ స్థాయిలో ఖర్చు పెట్టలేదన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ సర్దార్ ఖాన్, కాంగ్రెస్ నాయకులు నక్క రాములు గౌడ్, రమేష్ గౌడ్, వెంకట్ గౌడ్, బాబు పాల్గొన్నారు.

కథలు విద్యార్థుల వికాసానికి దోహదం పడతాయి



నవతెలంగాణ-చేర్యాల

కథలు విద్యార్థుల వికాసానికి దోహదం చేస్తాయనీ, వాటిని పిల్లలకు అందుబాటులో ఉంచాలని తెలుగు పాఠశాల సముదాయ అధ్యక్షులు చంద్రశేఖర్ రావు అన్నారు. మండల పరిధిలోని కడవేరుగు జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం విశ్రాంత ఉపాధ్యాయులు బాలసాహితీవేత్త గరిపల్లి అశోక్ వ్రాసిన "గోటీలాట" కథల పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. అశోక్ పిల్లల కోసం వ్రాసిన కథలు అద్భుతంగా ఉన్నాయని, ఇవి చదివి పిల్లలెంతో ఆనందిస్తారని నాగపురి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎలికట్టె అయిలయ్య అన్నారు. తెలుగు ఉపాధ్యాయులు కాంతికృష్ణ పుస్తక సమీక్ష చేస్తూ అనుభవాలే కథలుగా మారితే గోటీలాట పుస్తకమయ్యిందని అన్నా రు. ఈ సందర్భంగా నూతనం గా ఉద్యోగంలో చేరిన తెలుగు పండితులు ప్రభాకర్ రెడ్డి, భాగ్యలక్ష్మి, కవితల ను సన్మానించారు. కళాకారుడు జనార్దన్ వేణుగాన కచేరీ నిర్వహిం చారు. కార్యక్రమ ప్రారంభంలో మరణించిన తెలుగు ఉపాధ్యాయులు ధర్మారెడ్డికి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, మంగళగిరి రామ చంద్రమూర్తి, నవీన్,కరుణాకర్, శారద, రఘుపతి,రాజిరెడ్డి, ఉప్పలయ్య, కవిత, రజిత, సీఆర్పీ రవీందర్ పాల్గొన్నారు.

దర్బార్ స్ట్రీట్ ది కేఫ్‌ను ప్రారంభించిన మైనంపల్లి



నవతెలంగాణ-తూప్రాన్

తూప్రాన్ మున్సిపల్‌లోని శుభం హెూటల్ పక్కన దర్బార్ స్ట్రీట్ ది కేఫ్‌ను మైనంపల్లి హనుమంతరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మైనంపల్లి హనుమంతరావు, చిట్కుల్ మహిపాల్ రెడ్డిలను కేఫ్ యజమాని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, దుబ్బాక కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి, జిల్లా సీనియర్ నాయకులు తాడెం వెంగళరావు , మండల నాయకులు, కౌన్సిలర్లు, రఘుపతి, ఆర్ఎంపీపీ, ఎంపీల అసోసియేషన్ మండల అధ్యక్షులు డాక్టర్ అప్సర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బలరాంరెడ్డి, రమేష్, గరిగే నరసింహారావు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

రాస్తారోకో నిర్వహించిన గుగ్గీల్ల గ్రామస్తులు
రాజీవ్ రహదారిపై భారీగా నిలిచిన వాహనాలు
న్యాయం చేయాలని పోలీసులతో గ్రామస్తుల వాగ్వివాదం





నవతెలంగాణ-బెజ్జంకి

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని రేగులపల్లి గ్రామ శివారులోని రాజీవ్ రహదారిపై కోహెడ యూటర్న్ వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. గుగ్గీల్ల గ్రామానికి చెందిన సోము కొంరయ్య వారసంతల్లో కూరగాయలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. వారసంతలో కూరగాయలు విక్రయించి తిరిగి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళ్తున్న క్రమంలో కోహెడ యూటర్న్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొంది. వ్యక్తి అక్కడిక్కడే మృతి చెందగా సమాచారం తెలుసుకున్న పలువురు గుగ్గీల్ల గ్రామస్తులు సంఘటన స్థలానికి చేరుకుని రాజీవ్ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. దీంతో రహదారిపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ క్రిష్ణారెడ్డి, కోహెడ ఎస్ఐ అభిలాష్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని భారీగా నిలిచిన వాహనాలను తరలించేలా సహరించాలని గుగ్గీల్ల గ్రామస్తులకు సూచించారు. ఢీకొట్టి పరారైన గుర్తు తెలియని వాహనదారుడిని గుర్తించి మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని గుగ్గీల్ల గ్రామస్తులు పోలీసులను పట్టుబట్టారు. నిలిచిన వాహనాలను తరలించేలా సహరించాలని ఎస్ఐలు అభిలాష్ కోరడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ వాగ్వివాదం చేశారు. సంఘటన వివరాలు పూర్తి గా తెలియాల్సి ఉంది.

పాత మంజూరిలకు కొత్త పూత

- రద్దు చేసిన నిధులను తిరిగి మంజూరు చేయాలి
- ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి



నవతెలంగాణ-మిరుదొడ్డి

గత ప్రభుత్వం హయాంలో ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి కృషితో బీటీ రోడ్ల కోసం ఎస్డీఎఫ్ ద్వారా రూ. 40 కోట్లు మంజూరు చేయించారు. తర్వాత నియోజకవర్గంలోని 14 బీటీ రోడ్లకు గానూ రూ. 26 కోట్లు మంజూరు చేయించగా, కొత్త గా వొచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసింది. తర్వాత ఎమ్మెల్యే కృషితో రద్దు అయిన వాటిలో నియోజకవర్గంలోని తొగుట, దుబ్బాక, అక్బర్ పేట-భూంపల్లి మండలాల్లోని 5 రోడ్లకు గానూ పంచాయతీ రాజ్ శాఖ ద్వారా 26 కిలోమీటర్ల మట్టి రోడ్డుకు బీటీ రోడ్డు మంజూరు కోసం రూ. 10.51 కోట్లు మంజూరు చేశారు. ఈ సందర్భంగా దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మెన్ వెంకటయ్యలు మాట్లాడుతూ..తొగుట మండలంలోని తుక్కాపూర్ నుంచి కాన్గల్, లింగంపేట ఎక్స్ రోడ్ కు. రూ. 1.66 కోట్లు, తొగుట మండలంలోని వర్ధరాజ్ పల్లి నుంచి మల్రికుంట రోడ్డు కు రూ.2.16 కోట్లు, అక్బర్ పేట-భూంపల్లి మండలంలోని చిట్టాపూర్, మోతె, కాసులాబాద్, రోడ్డుకు రూ.3.43 కోట్లు, వీరారెడ్డిపల్లి, జంగపల్లి, దౌల్తాబాద్ రోడ్డు కు రూ.1కోటి, దుబ్బాక మండలంలోని మెదక్ పీడబ్ల్యూ రోడ్ నుంచి ధర్మాజీ పేట, రామక్కపేట ఎక్స్ రోడ్ కు రూ.2.24 కోట్లు మంజూరు చేశారన్నారు. ఇట్టి రోడ్ల మంజూరు గత ప్రభుత్వం లో రాగా కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని రద్దు చేసింది. తిరిగి ఈ మట్టి రోడ్లకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. గతం లో మంజూరు అయిన 14రోడ్లలో కేవలం 5 రోడ్లకు మంజూరు ఇచ్చారు. అభివృద్ధిపై రాజకీయాలు చేయాల్సిన అవసరం లేదని, ఇప్పటికైనా స్పందించి మిగిలిన రోడ్లకు నిధులు మంజూరు చేయాలని కోరారు. నిధులు తిరిగి మంజూరు చేసిన మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు తెలిపారు.

రేవంత్ పాలనలో పుల్లూరు బండ అభివృద్ధికి కృషి

- మల్కాజ్గిరి మాజీ ఎమ్మెల్యే



నవతెలంగాణ-సిద్దిపేటరూరల్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో పుల్లూరు బండ అభివృద్ధికి కృషి చేస్తామని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమం తరావు అన్నారు.శుక్రవారం సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు గ్రామంలోని లక్ష్మీనరసిం హస్వామి దేవస్థానం జాతర ఉత్సవాలలో ఆయన నియోజ కవర్గ ఇన్చార్జి పూజల హరికృష్ణతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించి స్వామివారి ఆశీస్సులను తీసుకు న్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత పదేండ్లలో దేవాలయాల అభివృద్ధి మరుగున పడిందని, సీఎం రేవంత్ రెడ్డి పాలనలో ఆలయాల అభివృద్ధి చెందుతున్నాయని, అందుకు నిదర్శనం వేములవాడకు రూ.100కోట్లు, మెదక్ జిల్లాలోని ఏడుపాయల దుర్గమ్మ దేవాలయానికి రూ.35 కోట్లను ఆయన కేటాయించినట్లు తెలిపారు. ఆలయానికి కావలసిన ప్రతి ఒక్క పనిని తానే దగ్గరుండి చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా దేవస్థాన కమటీ చైర్మెన్ కనకయ్య, డైరెక్టర్ రాములు బీసీ సెల్ మండల అధ్యక్షులు వెంకట్, అంజిరెడ్డి కాంగ్రెస్ నాయకులు, పాల్గొన్నారు.

మైనంపల్లికి ఘన స్వాగతం

నవతెలంగాణ-దుబ్బాక : కూడవెల్లి జాతరకు వచ్చిన మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే హనుమంత రావుకు కాంగ్రెస్ శ్రేణులు శుక్రవారం ఘన స్వాగతం పలికారు. అక్బర్ పేట-భూంపల్లి మండలం రామే శ్వరం పల్లిలోని కూడవెల్లి రామలింగేశ్వరయానికి కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సంద ర్భంగా వారిని శాలువాలతో సత్కరించారు. వారి వెంట కాం గ్రెస్ నాయకులు కొంగర రవి, కద్దూరి నరేందర్ రెడ్డి, పాతూ రి వెంకటస్వామి గౌడ్, పలువురు నాయకులు ఉన్నారు.

తూప్రాన్‌లో ఘనంగా గద్దర్ జయంతి వేడుకలు



నవతెలంగాణ-తూప్రాన్

తూప్రాన్ ముద్దు బిడ్డ, ఉద్యమాల పోరుబిడ్డ, ప్రజాగాయకుడు, మహనేత గుమ్మడి విఠల్ రావు (గద్దర్) 77వ జయంతి వేడుకలు శుక్రవారం తూప్రాన్‌లో ఘనంగా జరిగాయి. బస్టాండ్‌లోని డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద మున్సిపల్ తాజా మాజీ చైర్ పర్సన్ మామిళ్ల జ్యోతి కృష్ణ గద్దర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గద్దర్ తూప్రాన్ పట్టణానికి చేసిన సేవలను గుర్తు చేశారు. తూప్రాన్ పట్టణానికి సమీపంలో ఉన్న హల్దీ వాగు నుంచి పెద్ద చెరువులోకి నీటిని తరలించేందుకు నిర్మించిన ప్రాజెక్టుకు గద్దర్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుగా నామకరణం చేశామని గుర్తు చేశారు. తూప్రాన్ వాస్తవ్యులైన గద్దర్ జాతీయ స్థాయిలో మంచి ప్రజాగాయకుడిగా ప్రసిద్ధి చెందారని కొనియాడారు. గద్దర్ అమర్ హై అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మన్నె శ్రీనివాస్ రావు, సామల అశోక్, పర్స నర్సింగ్ రావు, ఏర్పుల రాము, ఏర్పులా బాలరాజు, కోరబోయి ప్రవీణ్ కుమార్, చిట్టిమిల్ల అనిల్ కుమార్, సత్తయ్య, రాములు, చిన్నలింగ్ మల్లికార్జున్ గౌడ్, జీడిపల్లి బాలయ్య, సాయి సమ్మర్, సత్యనారాయణ, భాను, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు బదిలీలు సహజమే

ఎంఈఓ తారా సింగ్



నవతెలంగాణ-నర్సాపూర్ 507

ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమేనని ఎంఈఓ తార సింగ్ అన్నారు. నర్సాపూర్ మండల పరిధిలోని ఆవంచ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు దన్ సింగ్ పదవీ విరమణ పొందిన సందర్భంగా వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులు చేసిన సేవలు ఎల్లప్పుడూ గుర్తుంటాన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్టియు మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి సామ్య నాయక్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు కాజా, అలీ ఖాన్, లక్ష్మీనారాయణ, భీమ్లా, ఇంతియాజ్, వీరేశం, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మైల బోనం



నవతెలంగాణ-టేక్మాల్ : మండలం బొడమట్పల్లి కురుమ సంఘం ఆధ్వర్యంలో శ్రీ బీరప్ప స్వామి జాతర మహెూత్సవ కార్యక్రమాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మైల బోనం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మైల బోనాన్ని గ్రామంలో నుంచి ఊరేగిస్తూ వీర గంధాల వేషాధారణలతో నృత్యాలు చేస్తూ ఘనంగా ఊరేగించారు. అనంతరం బీరప్ప స్వామి దేవాలయం వద్ద ప్రత్యేక పూజ నిర్వహించి బోనాన్ని సమర్పించారు.

భయం వద్దు ధైర్యంగా ఉండాలి

- ప్రజలకు భరోసా ఇచ్చిన టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి



నవతెలంగాణ-నంగునూరు

భయం వద్దు ధైర్యంగా ఉండాలని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరి భరోసా ఇచ్చారు. శుక్రవారం నంగునూరు మండలం సిద్దన్నపేట గ్రామంలో నిర్వహించిన మెడికల్ క్యాంప్‌లో ఆయన మాట్లాడుతూ..గత నెల రోజుల్లో చాలామందికి గుండె పోటు సంబంధించిన లక్షణాలు ఉన్నాయని, అదే కారణంగా ఒక్కరు చనిపోయారని, కొందరికి ఆపరేషన్ జరిగిందని గ్రామ ప్రజలు ఆందోళనతో ఉన్నారని కాంగ్రెస్ నాయకులు, నా దృష్టికి తీసుకొచ్చారని వెంటనే జిల్లా వైద్యాధికారికి ఇక్కడ పరిస్థితి వివరించామన్నారు. వైద్య శిభిరం ఏర్పాటు చేశామని, ఇది అందరు సద్వినియోగం పర్చుకోవాలని సూచించారు. అలాగే మినిరల్ వాటర్ ద్వారా కూడ అనుమానాలు ఉన్నాయని, ఆ నీటిని కూడ తక్షణమే పరీక్షలు చేయాలనీ సంబంధించిన అధికారులను కోరామని స్పష్టం చేశారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజేందర్ మాట్లాడుతు గుండె నొప్పి అనేది అంటువ్యాధి కాదని ఒక్కరికి వస్తే చుట్టూపక్కల వాళ్ళకి రాదని గుర్తుంచుకోవాలని తెలిపారు. కొవ్వు పదార్థాలు ఎక్కువ తీసుకునే వాళ్లకు ఎక్కువ వత్తిడి కి లోనయ్యేవాళ్లకు, పొగతాగేవాళ్లకి వస్తుందని అవి మానేస్తే ఆరోగ్యంగా ఉంటారని గుర్తు చేశారు. ఇంకేమైనా అనుమా నాలు ఉన్న ప్రజలు వైద్య శిబిరానికి వచ్చి పరీక్షలు చేయించు కోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అంజలీ రెడ్డి, సీహెచ్ఓ ఎల్లవ్వ, పిహెచ్ఎన్ జయమ్మ, ఎంహెచ్ఎల్పీ అర్చన,రవి, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.